

నగరంలో కురిసిన భారీ వర్షానికి జలమయమైన ప్రధాన రహదారులు




హైదరాబాద్ వార్త


# స్టేషనరీ కొనుగోళ్లలో జాగ్రత్తలు తప్పనిసరి..!

-పరిశీలించి కొంటేనే మన్నికైన వస్తువులు లభ్యం
-తల్లిదండ్రులు,విద్యార్థులతో కిక్కిరిసిపోతున్న దుకాణాలు
-అధికధరలతో దోపిడీచేస్తున్న స్టేషనరీ వ్యాపారులు



**హైదరాబాద్,జూన్ 12,ప్రభాతవార్త:** వేసవి సెలవులను ముగించుకుని విద్యార్థులు తిరిగి పాఠశాలలకు చేరే సమయం ఆసన్నమైంది. ఈనేపథ్యంలో పిల్లలకు పుస్తకాలు నోట్ బుక్‌లు,బ్యాగ్‌లు పెన్నులు పెన్సిళ్లు కొనడంలో తల్లిదండ్రులు నిమగ్నమైపోయారు. దీంతో నగరంలోని వివిధ స్టేషనరీ షాపులు విద్యార్థులు,తల్లిదండ్రులతో కిక్కిరిసి పోతున్నాయి.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఉచితంగానే ఇస్తున్నా.. ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కచ్చితంగా పుస్తకాలు కొనుక్కోవాల్సి ఉంటుంది. ఇప్పటికే అధిక ఫీజులతో బేజారవుతున్న తల్లిదండ్రులకు పుస్తకాల కొనుగోలు అదనపు భారం అవుతోంది. చాలా ప్రైవేట్ పాఠశాలలు ముందే ఆయా కంపెనీల వారితో మాట్లాడుకుని భారీ మొత్తంలో స్కూళ్లకే నోట్‌బుక్స్ తెప్పించుకొని విద్యార్థులకు అధిక ధరలకు అమ్ముతున్నారు. కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలైతే సొంతంగా పుస్తకాలను ముద్రించి ధరను కూడా వారే నిర్ణయించి విద్యార్థుల నుండి అందినకాడికి దోచుకుంటున్నారు.ఈదోపిడీ ఇలా ఉంటే స్టేషనరీ నిర్వాహకులు కూడా విద్యార్థులను, తల్లిదండ్రులను నిలువునా దోచేస్తున్నారు. ఈమేరకు తూనికలు కొలతల అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లోని స్టేషనరీ,గిఫ్ట్స్ షాపుల్లో విస్తృత దాడులు నిర్వహించారు. పుస్తకాల అమ్మకాల్లో కొందరు వ్యాపారులు భారీగా మోసం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రత్యేకించి పుస్తకాల పై ఎమ్మార్పీ ధరలు ముద్రించకపోవడం, తయారీ దారుడి చిరునామా లేకపోవడం వంటివి అధికారులు తనిఖీల్లో బయటపడ్డాయి. వ్యాపారులు చెప్పినట్టుగా నిర్ణీత పేజీలు లేకపోవడం,పుస్తకం మందం తక్కువగా ఉండటం వంటివే కాకుండా ఎంఆర్‌పీ ముద్రించకుండా ధరలు వారే నిర్ణయించి అమ్ముతున్నారు.ఇక గిఫ్ట్ ఆర్టికల్స్,పెన్నులు,పిల్లలకు అవసరమై వస్తువులు,నోట్‌పుస్తకాలు ఇతర వస్తువులపై ఎమ్మార్పీ ధరలు లేకుండా అమ్ముతున్న విషయం బయటపడటంతోఆయా స్టేషనరీలను హెచ్చరించి నోటీసులు ఇచ్చారు

## తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలి ..

వినియోగదారుల హక్కుల చట్టం-1986ప్రకారం ప్రతి అమ్మకం దారుడు తాను అమ్మే వస్తువులకు సంబంధిచి ఎమ్మార్పీ, ఉత్పత్తిదారుడి చిరునామా కచ్చితంగా ముద్రించాలి.అయితే స్టేషనరీ షాపుల్లో మాత్రం ఎలాంటి ఎమ్మార్పీ, చిరునామాలు లేకుండా వినియోగదారుల కళ్లుగప్పి అందినకాడికి దోచుకుంటున్నారు. ఇప్పటికే అధిక ఫీజులతో బేజారవుతున తల్లిదండ్రులకు పుస్తకాల కొనుగోలు అధనపు భారంగా మారింది. షాపుల్లో కూడా ప్రైవేట్ పబ్లిషర్ల పుస్తకాలు ఎక్కువ ధరకే అమ్ముతున్నారు.దీన్ని దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు కొన్ని జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎక్కడ తక్కువ ధరకు దొరుకుతాయో ముందుగా నేకనుక్కోవాలి.హోల్‌సేల్ వ్యాపారుల వద్ద పుస్తకాలు కొనుగోలు చేస్తే తక్కువ ధరకు దొరకడంతో పాటు నాణ్యమైన పుస్తకాలు, నోట్ బుక్‌లు దొరికే అవకాశం ఉంది.నోట్స్ కొనేటప్పుడు పేపర్ క్వాలిటీ,అట్టలు గట్టిగ ఉన్నాయా లేదా చూసుకోవాలి. అలాగే పెన్నులు,పెన్సిళ్లు సైతం తక్కువ ధరకే లభిస్తాయి. ఆమేరకు కొనుగోలు దారుడికి లాభం కలిగినట్టే..నోట్ పుస్తకాలన్నీ ఒకేసారి కాకుండా అర్ధసవత్సరానికి సరిపడకొని మిగతావి కొన్న నోట్స్ రాయడం పూర్తయిన తర్వాత కొనాలి.ఒకేసారి నోట్ బుక్ కొటే విద్యార్థి వాటిని వృథా చేసే ఆస్కారం ఉంటుంది.అంతే కాకుండా వాటిని స్కూళ్లనో..లేక ఇంట్లోనో పోగొట్టే అవకాశం ఉంటుంది. అలాగే బ్యాగుల కొనుగోలు విషయంలో కూడా తల్లిదండ్రులు వాటి నాణ్యతను,మన్నికు తప్పక దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు సౌకర్యంగా ఉన్నబ్యాగులనే కొనాలి. వాటిలో కంపాక్స్ బాక్స్,టిఫిన్‌బాక్స్ వంటివి పెట్టుకోవడానికి అనువుగా ఉన్నవాటిని ఎంపిక చేసుకోవాలి.ఇక పెన్నుల పెన్సిళ్లు కొనడంలో జాగ్రత పాటించాలి. ఒకేసారి ప్యాకెట్ కంటే ఎక్కువ కొనొద్దు అలాకొంటే విద్యార్థులు వాటిని పోగొట్టే అవకాశం ఉంటుంది. ఇక స్కూల్‌డ్రెస్‌లు,షూస్ వంటి వాటి కొనుళ్లపైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ఒకసారి కొంటే సవంత్సరం అంతా వినియోగిస్తారు కాబట్టిమన్నికైన, చూసేందుకు బాగా ఉన్నవాటినే కొనాలి. రేటు విషయంలో మనం కొనుగోలు చేసే వస్తువుల ధరలు పలుదుకాణాల్లో వాకబు చేయడం ద్వారా తక్కువ దొరకడంతో పాటు నాణ్యమైన వస్తువులు దొరికే అవకాశం ఉంది. ఇలా ప్రతి తల్లిదండ్రులు తగిన జాగ్రత్తతో వస్తువులను ఎంపిక చేసుకుంటే ప్రతి పైసా వృథా కాకుండా ఉంటుంది.

## రోడ్డు పనులు వేగవంతంగా పూర్తి చేయాలి : ఎంఎంసీ కమిషనర్



కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి వివరాలు వెల్లడిస్తున్న లింగాల రాహుల్‌గౌడ్

**ఎల్.బి.నగర్, జూన్ 12 ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను వెంటనే పూర్తి చేసి సమస్యలను పరిష్కరించాలని మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. కొత్తపేట డివిజన్ పరిధి లోని ఎస్ఆర్‌ఎల్ కాలనీలో పెండింగ్‌లో ఉన్న రోడ్డు, న్యూనాగోల్ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఎంఎంసీ కమిషనర్ పరిశీలించడానికి రావడంతో స్థానికంగా చాలా కాలంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను కొత్తపేట డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మార్గం ద్వారా ప్రయాణించే ప్రజలు గత రెండు సంవత్సరాలుగా సుమారు 15 కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కమిషనర్‌కు తెలిపారు. వర్షాకాలం వచ్చిందంటే ఈ ప్రాంతం చెరువును తలపిస్తోందని కమీషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు స్పందించిన కమిషనర్ సంబంధిత ఏఈ, డీఈ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.అధికారులు స్పందిస్తూ ఎస్ఆర్‌ఎల్ కాలనీ రోడ్డు నిర్మాణ పనులకు ఇప్పటికే పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయని, ప్రస్తుతం టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. కాగా టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. న్యూనాగోల్‌లో చేపట్టిన బాక్స్‌డ్రెయిన్స్ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత మున్సిపల్ అధికారులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## నీలోఫర్ ఎన్ఓసి రద్దుచేసిన అగ్నిమాపక శాఖ అధికారులు

**జూబ్లీహిల్స్, జూన్ 11, ప్రభాతవార్తః** బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని నిలోఫర్ కేఫేకు తెలంగాణ అగ్నిమాపక శాఖ షాక్ ఇచ్చింది. అగ్నిమాపక భద్రతా నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ, ఎలాంటి అనుమతులు లేకుండా నాలుగో అంతస్తులో రెస్టారెంట్ నిర్వహిస్తున్నట్లు గుర్తించిన అధికారులు, ఆ భవనానికి జారీ చేసిన ఫైర్ ఎన్ఓసీని రద్దు చేశారు ఇటీవల నగరంలో వరుసగా చోటుచేసుకుంటున్న అగ్నిప్రమాదాలు, వాటివల్ల సంభవిస్తున్న ప్రాణ, ఆస్తి నష్టాల నేపథ్యంలో అగ్నిమాపక శాఖ అప్రమత్తమైంది. విశ్వసనీయ సమాచారం మేరకు బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని నిలోఫర్ కేఫే వాణిజ్య భవనం (డోర్ నెం. 82682/82, పి3)లో ఫైర్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఫైర్ లైసెన్స్ నిబంధనలకు విరుద్ధంగా యాజమాన్యం పలు అవకతవకలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. భవన నిర్మాణ ప్లాన్, అగ్నిమాపక శాఖ అనుమతులకు విరుద్ధంగా.. భవనంలోని నాల్గవ అంతస్తు పైభాగంలో ఎలాంటి పర్మిషన్ లేకుండా పూర్తి స్థాయి రెస్టారెంట్ను నిర్వహిస్తున్నట్లు నిర్ధారించారు. ఇరుకైన మార్గాలు, నిబంధనల ఉల్లంఘనల కారణంగా అగ్నిప్రమాదం జరిగితే కస్టమర్ల ప్రాణాలకు, ఆస్తులకు తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని తనిఖీ నివేదికలో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ యాజమాన్యానికి కఠిన హెచ్చరికలు జారీ చేశారు. అగ్నిప్రమాదాల నివారణకు సంబంధించిన అన్ని భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే మరింత కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు

## మొహర్రంకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు : సిపి వి.సి సజ్జనర్



సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనర్

**చార్మినార్,జూన్ 12 ప్రభాతవార్త :** మొహర్రం సందర్భంగా ఊరేగింపు మార్గంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండ ఉండేలా ముందు జాగ్రత్తగా కట్టు దిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనర్ అన్నారు. సాలార్‌జంగ్ మ్యూజియం ఆడిటోరియంలో శుక్రవారం నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనర్ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం జరిగింది.ఈ సందర్భంగా సీపీ వి.సి.సజ్జనర్ మాట్లాడుతూ ఊరేగింపు డబీర్‌పురలోని బీబీ-కా-ఆలం అషూర్ ఖానా నుంచి ప్రారంభమై ఎత్తె బార్ చౌక్,అలీజాకోట్ల,పంజేషా,మీరాలంమండి,చార్మినార్,గుల్జారాహౌస్,పురానీహవేలీ,దారుషిపా ప్రాంతాలు మీదుగా కొనసాగిన అనంతరం చాదర్‌ఘాట్‌లోనిమజిద్-ఎ-ఇలాహి వద్ద ముగుస్తుందని తెలిపారు.మొహర్రం ఊరేగింపు సందర్భంగా మళ్లించటంతో పాటు వాహనాలు కోసం పార్కింగ్ సదుపాయాలను కల్పిస్తున్నామని ఆయన తెలియజేశారు.శాంతి భద్రతల పరిరక్షణ కోసం రాపిడ్ యాక్షన్ ఫోర్సుతో పాటు అదనపు పోలీస్ ప్లాటూన్లను మొహరిస్తున్నామని,మహిళల రక్షణ కొరకు షీటీమ్స్,టాస్క్ ఫోర్స్ బృందాలతో నిరంతరం నిఘాఉంటుందని ఆయన తెలిపారు.గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ అన్ని భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలియజేశారు.ఊరేగింపులో పాల్గొనే ఏనుగు భద్రత,సంరక్షణపై ప్రత్యేక మార్గదర్శకాలను ఆయన విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో షియా కమిటి ప్రతినిధులు ఎమ్మెల్యేలు అహ్మద్ బలాల,మీర్ జుల్ఫికర్ అలీ,ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హసన్ అఫెంది,చార్మినార్ జోన్ డిసిపి ఖరే కరణ్ ప్రభాకర్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస్‌తో పాటు పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న పేరిణి నృత్యకుసుమాలు




నృత్యకళాకారులతో నరసింహారెడ్డి, విజయ్‌కుమార్, దినకర్, రాజ్‌కుమార్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, జూన్ 12 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతి కశాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల కళామందిరం) ఆరుబయలు కళావేదికలో 99 రోజులపాటు నిర్విరామంగా జరుపుతున్న సాంస్కృతిక మహోత్సవంలో 72వ రోజు తెలంగాణ ప్రజాకళ పూదోటలో గుభాళించిన 72మంది కళాకారుల పేరిణి నృత్య కుసుమాలు అని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి చిన్నారుల నృత్యవిన్యాసాన్ని అభివర్ణించారు. బిస్మిల్లా ఖాన్ పురస్కార గ్రహీత, ప్రముఖ పేరిణి నృత్యగురువు పేరిణి రాజ్‌కుమార్ వేసవి సెలవులను పురస్కరించుకుని నిర్వహించిన ఉచితం శిక్షణా శిబిరంలో చిన్నారి కళాకారులకు అద్భుతంగా శిక్షణ కావించి అందులో నుండి 72మంది కళాకారులతో ప్రాచీన సంప్రదాయ నాట్యకళ పేరిణి ప్రదర్శనతో ఆహుతులను అబ్బురపరిచింది. కాకతీయుల కాలంనాటి ఈ వీర నృత్యాన్ని భవి ష్యత్తు తరాలకు అందించడానికి భాషా సాంస్కృతిక శాఖ చేస్తున్న కృషిలో ఈ ఉచిత శిబిరం ఒక భాగమేనని, ఇలాంటి శిబిరాలను నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిర్వాహకుడు పేరిణి రాజ్‌కుమార్ కళాసేవను నరసింహారెడ్డి ప్రశంసించారు. నేటి తెలంగాణ ప్రజాకళ సాంస్కృతిక మహోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. ఏనుగు నరసింహారెడ్డి విశిష్ట అతిథులు డా. విజయ్‌కుమార్, దినకర్, పల్లె నర్సింహ, ఒగ్గురవి తదితరులతో కలిసి ఈనాటి అద్భుత ప్రదర్శనిచ్చిన 72మంది విద్యార్థులకు, నాట్యనేర్పిన గురువులు కస్తూరి, చందన ప్రమదలను కూడా అభినందిస్తూ అందరినీ ప్రశంసాపత్రాలను ఘనంగా సన్మానించి శుభాభినందనలు తెలిపారు.

## ఉప్పల్ చౌరస్తాలో మరోసారి మొరాయించిన స్కైవాక్ లిఫ్ట్

-రెండు గంటల యాతన.. నిర్వహణ మరిచిన అధికారులు

**ఉప్పల్, జూన్ 12 ప్రభాతవార్త :** ఉప్పల్ చౌరస్తాలో సుమారు రూ. 30 కోట్ల వ్యయంతో నిర్మించిన స్కైవాక్ నిర్వహణ చేయడంలో అధికారులు పూర్తిగా విఫలం అవుతున్నారు. పలుమార్లు స్కైవాక్ లిఫ్ట్ మొరాయించి ప్రజలు అందులో చిక్కుకుని అవస్థలు పడుతున్నారు. ఇదే క్రమంలో గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఉప్పల్‌లోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర హాస్టల్‌లో ఉండే రాహుల్ ఎన్ఆర్‌బి బేరింగ్‌లో పని ముగించుకుని ఇంటికి వస్తూ లిఫ్ట్ ఎక్కాడు. దీంతో లిఫ్ట్ మధ్యలోనే ఆగిపోయింది. దీంతో అతను తీవ్ర భయాందోళనకు గురైయ్యాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది అక్కడికి సహాయ చర్యలు చేపట్టారు. సుమారు రెండు గంటలు శ్రమించి లిఫ్ట్‌లో ఉన్న అతనిని సురక్షితంగా కాపాడారు. లిఫ్ట్ నిర్వహణ చూస్తున్న కృష్ణ కన్స్‌స్ట్రక్షన్ కంపెనీ సరిగ్గా పట్టించుకోకపోవడం వల్లే తరుచూ ఇటువంటి సమస్యలు వస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి స్కైవాక్ లిఫ్ట్‌ల నిర్వహణ మెరుగుపర్చాలని స్థానికులు కోరుతున్నారు.

## విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి.. మరొకరికి గాయాలు

**అత్తాపూర్ జూన్ 12,ప్రభాతవార్త :** ఓ అపార్ట్‌మెంట్ ముందు ఏర్పాటు చేసిన వెల్కమ్ బ్యానర్ ఫ్రేమ్‌ను తొలగిస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ గురై ఒకరు మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లో చోటుచేసుకుంది.ఎస్సై రాఘవేందర్ వివరాల ప్రకారం...కిస్మాత్‌పూర్‌లోని మ్యాజిస్టిక్ అపార్ట్‌మెంట్‌లో స్వీపర్‌గా నిజాబాద్‌కు చెందిన భూక్య మిట్యా (54) పని చేస్తున్నాడు. అదే అపార్ట్మెంట్లో దర్గా ఖలీజ్ ఖాన్ కు చెందిన గొల్లపల్లి శ్రీనివాస్ వాచ్ మెన్‌గా పనిచేస్తున్నాడు.అయితే అపార్ట్మెంట్ కు సంబంధించిన ఫ్లెక్సీ బోర్డును కిస్మత్ పూర్ రహదారిపై ఇద్దరు కలిసి ఓ భారీ నిచ్చెన సహాయంతో ఏర్పాటు చేస్తుండగా ప్రమాదవశాత్తు నిచ్చెన 11 కె.వి తీగలకు తగిలింది. దీంతో భూక్య మిట్యాకు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే కింద పడిపోయాడు. శ్రీనివాస్ కింద ఉండడంతో పక్కకు పడిపోయాడు. వెంటనే స్థానికులు తీవ్ర గాయాలకు గురైన భూక్య మిట్యాను మెడి లైఫ్ హాస్పిటల్ కు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ భూక్య మిట్యా మృతి చెందాడు. శ్రీనివాస్ స్వల్ప గాయాలతో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## భావ చేతిలో షేక్ మసూద్ దారుణ హత్య..

**కార్వాన్,జూన్12(ప్రభాతవార్త)** గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుమ్మరివాడి ప్రాంతంలో చాందీ మసూద్ ఉర్ఫాఫ్ షేక్ మసూద్ 26 అతని నివాసంలో దారుణ హత్య కు గురైనాడు.మృతుడు వృత్తి రీత్యా ఎలక్ట్రిషన్,అనేక వెండి ఆభరణాలు ధరించడం వల్ల స్థానికంగా చాందీ మసూద్ గా,యూ ట్యూబర్ గా పేరు పొందాడు.అతనిది ప్రేమ వివాహమని,అతనికి ఓ కొడుకు ఉన్నాడని,కుటుంబ సంబంధించిన వివాదం తర్వాత ఈ సంఘటన జరిగిందని స్థానికుల సమాచారం.సమాచారం అందుకున్న గోల్కొండ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని,మృతదేహాన్ని శవ పరీక్ష కోసం ప్రభుత్వ తరలించి,దర్యాప్తు ప్రారంభించారు.సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ఆధారాలను సేకరించారు.ఏసిపి జావీద్ మాట్లాడుతూ..మధ్యాహ్నం 3 గంటల సమయంలో మసూద్‌పై అతని భావ సోహెల్ తన 3 సన్నిహితులతో కలసి మారణాయుధాలతో దాడి చేయడంతో అతను అక్కడికక్కడే మరణించాడని పోలీస్‌లు పేర్కొన్నారు.హత్యకు దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు చేస్తున్నామన్నారు.త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

# వర్షానికి ముందే అప్రమత్తమవుదాం

-వరద ముప్పు ప్రాంతాలపై నిరంతర నిఘా ఉండాలి
-సమస్య ఉత్పన్నం కాకముందే పరిష్కరించాలి
-డిఆర్ఎఫ్ బృందాలకు హైడ్రా కమిషనర్ దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రంగనాథ్, అదనపు సంచాలకులు వర్ల పాపయ్య తదితరులు

**హైదరాబాద్, జూన్ 12,ప్రభాతవార్త:** ఇటీవల కురిసిన వర్షానికి నగరం నీట మునిగిందని ఆపరిస్థితులు పునరావృతం కారాదని హైడ్రా అధికారులతో పాటు డీఆర్ఎఫ్ బృందాలకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ సూచించారు. ఊహించని విధంగా పడుతున్న వర్షాలకు అనుగుణంగా మన ప్రణాళికలుండాలన్నారు. వర్షాకాల సన్నద్ధతపై డీఆర్ఎఫ్ బృందాలకు శుక్రవారం కమిషనర్ దిశానిర్దేశం చేశారు. మూడు కమిషనరేట్ల పరిధిలో 913చోట్ల వరద ముంచెత్తే ప్రాంతాలను గుర్తించామని ఇందులో మేజర్ ప్రాబ్లం ఉన్న ప్రాంతాలు 257 ఉన్నాయన్నారు. ఈపాయింట్ల వద్ద డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉండాలని సూచించారు. 51 డీఆర్ఎఫ్ బృందాలకు తోడు.. త్వరలోనే మెట్, స్టాటిక్ టీమ్‌లు కూడా అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. ఈ బృందాలన్నీ సమన్వయంతో ఇతర శాఖలతో కలసి పని చేయాలని సూచించారు. 24 ఇంటూ 7 మాదిరి వాతావరణ హెచ్చరికలను క్షుణ్ణంగా పరిశీలించి వర్షానికి ముందే సన్నద్ధమవ్వాలన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్య తలెత్తుతుందో అందుకు పరిష్కారం ఏంటో కూడా తెలియాలన్నారు. వర్షం పడినప్పుడు వరద ముంచెత్తకుండా చూడాలని వర్షం లేనప్పుడు సమస్యకు కారణాలపై దృష్టి పెట్టాలన్నారు. అలాగే మేజర్ వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద స్థానికులతో కలసి కమిటీలను ఏర్పాటు చేసి సమస్య పరిష్కారంలో వారిని భాగస్వామ్యం చేయాలని సూచించారు. అలాగే మ్యాన్‌హోల్స్ ఎక్కడ ఉన్నాయనేది గుర్తించే విధంగా అక్కడ దగ్గర్లోని గోడకు మార్కింగ్ చేయాలని సూచించారు. ఈనెల 9వ తేదీన ఒక్కసారిగా కురిసిన వర్షానికి నీట మునిగిన ప్రాంతాలపై సమీక్షించారు. అక్కడ వరద ముంచెత్తడానికి గల కారణాలను వివరించి.. ఆ సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. ప్రధాన రహదారులు ప్రథమ లక్ష్యంగా.. పని చేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలి. ఒక్క రోజు నగరంలో ట్రాఫిక్ సమస్య తలెత్తితే రూ. 400ల కోట్ల వరకూ నష్టం జరుగుతుందని నిపుణులు అంచనా వేశారని.. ఆ విషయాన్ని గుర్తు పెట్టుకుని హైడ్రా బృందాలు పని చేయాలని సూచించారు. అన్ని విభాగాలతో కలసి ఎక్కడా కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా జాగ్రత్త పడాలన్నారు. చెట్లు పడిపోయినప్పుడు సహాయక చర్యలు చేపట్టే సమయంలో డీఆర్ ఎఫ్ వాహనాలు వెళ్లే పరిస్థితి ఉండదని.. ఆ సమయంలో బైకులపై చేరే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, అడిషనల్ కమిషనర్,ఆర్ సుదర్శన్, ఏసీపీలు పి. తిరుమల్, ఉమా మహేశ్వర రావు,శ్రీకాంత్, ఆర్ఎఫ్‌వో జయప్రకాష్‌తో పాటు డీఎఫ్‌వోలు, ఎస్ఎఫ్‌వోలు, ఇన్‌స్పెక్టర్లు ఈసమావేశంలో పాల్గొన్నారు.

# ఆఫీసర్‌ను పట్టుకొని ఏం మాట్లాడుతున్నావు..!

- ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన జీహెచ్ఎంసీ ఉద్యోగులు
- కేసు నమోదు చేసిన బంజారాహిల్స్ పోలీసులు

**జూబ్లీహిల్స్, జూన్ 12, ప్రభాతవార్తః** వారు ప్రభుత్వ వాహనంలో రాలేదు.. అందునా.. రాంగ్‌రూట్‌లో కారులో వచ్చారు.. అడ్డుకున్న కానిస్టేబుల్‌తో అడ్డదిడ్డంగా ప్రవర్తించడమే కాకుండా ఆఫీసర్‌ను పట్టుకొని ఏం మాట్లాడుతున్నావు అంటూ దాడికి పాల్పడ్డారు.. ట్రాఫిక్ కానిస్టేబుల్ ఫిర్యాదుతో బంజారాహిల్స్ పోలీసులు ఇద్దరు జీహెచ్ఎంసీ ఉద్యోగులపై కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 2లో లూసిడ్ సమీపంలో వన్ వే ఉంది. జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం ఏఈ ఆనంద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అమిత్‌లు టీఎస్08 కేసీ 4422 హ్యుండాయ్ ఎక్స్‌టర్ వాహనంలో అటువైపుగా వచ్చారు. అదే సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న బంజారాహిల్స్ ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రీశైలం వన్ వే కారణంగా రాంగ్‌రూట్‌లో వస్తున్న వారి వాహనాన్ని అడ్డగించారు. దారి లేదని చెబుతున్నా వినకుండా ముందుకు రావడంతో శ్రీశైలం తన సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. దీంతో కారులో నుంచి దిగిన ఆనంద్ ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో గొడవకు దిగాడు. నేరుగా వచ్చి సెల్‌ఫోన్‌ను లాక్కొనేందుకు ప్రయత్నించడంతో ఫోన్ కింద పడిపోయింది. దారి లేదని శ్రీశైలం చెబుతుండగా 'ఆఫిసర్‌ను పట్టుకొని ఏం మాట్లాడుతున్నావ్..!' అంటూ ఒక్కసారిగా రెచ్చిపోయి కానిస్టేబుల్‌పై చేయి చేసకున్నాడు. ఆయనతోపాటు ఉన్న అమిత్ సైతం ఉన్నాడు. కానిస్టేబుల్‌ను తీవ్రంగా దూషించారు. దాడి చేసినప్పటికి కానిస్టేబుల్ ఆ దారిలో వెళ్లేందుకు నిరాకరించడంతో వారిద్దరు వచ్చిన దారిలో తిరుగుముఖం పట్టారు. శ్రీశైలం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆనంద్, అమిత్‌లపై బీఎన్ఎస్ సెక్షన్ 121(2), 132, 352, 351(2) కింద కేసు నమోదు చేశారు. ఇద్దరు జీహెచ్ఎంసీ ఉద్యోగులను శుక్రవారం బంజారాహిల్స్ పోలీసులు పిలిచి విచారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

## పేదలకు మరింత మెరుగైన సేవలు అందించండి



డాక్టర్ రాహుల్ దేవరాజ్‌ను సత్కరిస్తున్న విజయారెడ్డి.

**జూబ్లీహిల్స్, జూన్ 12, ప్రభాతవార్త:** నిమ్స్ డైరక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రాహుల్ దేవరాజ్‌ను శుక్రవారం టిపిసిసి కార్యదర్శి, ఖైరతాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పి. విజయారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలను అందించి అభినందించారు. పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించాలని కోరారు. అంతకముందు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రియాంక అలను సైతం కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

## న్యాయవాద వృత్తి సమాజ హితానికి వేదిక : ప్రొఫెసర్ విజయలక్ష్మి




కార్యక్రమంలో పాల్గొన్న టీఎస్ లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ విజయ లక్ష్మి, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి. సరోజా వివేక్

**చిక్కడపల్లి జూన్ 12 ( ప్రభాతవార్త ) :** న్యాయవాద వృత్తి అత్యంత గౌరవప్రదమైనదని, సమాజంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందించే బాధ్యత ఈ వృత్తిపై ఉందని ప్రొఫెసర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం బాగ్ లింగంపల్లి కాకాస్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ లా కాలేజీలో 2026 బ్యాచ్ విద్యార్థుల గ్రాటిట్యూడ్ డే వేడుకలు కళాశాల మూట్ కోర్ట్ హాల్‌లో జరిగింది. కి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ విజయలక్ష్మి, ప్రత్యేక అతిథిగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి. సరోజా వివేక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు తాము ఆర్జించిన న్యాయ విద్యను సమాజ సేవకు వినియోగించి, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నైతిక విలువలను పాటిస్తూ, బాధితుల హక్కుల పరిరక్షణలో న్యాయవాదులు ముందుండాలని సూచించారు. డాక్టర్ జి. సరోజా వివేక్ మాట్లాడుతూ కాకా ఆశయాలు, సేవా దృక్పథంతోనే కళాశాల అగ్రపథంలో పయనిస్తోందని చెప్పారు. న్యాయవాద వృత్తిలో నిబద్ధత, నిజాయితీయే విజయానికి సోపానాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తుది సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. తమ విద్యా ప్రయాణంలో సహకరించిన యాజమాన్యానికి, గురువులకు కృతజ్ఞతలు తెలుపుతూ విద్యార్థులు భావోద్వేగపూరితంగా తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. అనంతరం విద్యార్థుల భవిష్యత్ బాగుండాలని అతిథులు ఆకాంక్షించారు.

## వెంకటేశ్వరస్వామి ఆలయంలో బండారు దత్తాత్రేయ పూజలు



**చిక్కడపల్లి, జూన్ 12 ( ప్రభాతవార్త ) :** హర్యాన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ శుక్రవారం చిక్కడపల్లిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. తన మనమరాళ్లతో కలిసి ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో మాజీ ఎంపీ బూర నరసయ్య గౌడ్, ఆలయ కార్యనిర్వహణాధికారి సుశీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ దేశప్రజలతో పాటు తెలంగాణ సమాజం అంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం అభివృద్ధి పథంలో మరింత ముందుకు దూసుకుపోవాలని ఆకాంక్షించారు. అలాగే, దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని, రాష్ట్రంలో శాంతిసౌభాగ్యాలు విలసిల్లాలని ఆయన కోరుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు బండారు దత్తాత్రేయకు వేద ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చాతిరి పార్థసారథి, కైలాష్ నగేష్, బీజేపీ నేతలు కర్ణం బాబు, ఉపేందర్, జట్కార్ శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఆలయ సిబ్బంది, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## ఆర్య వైశ్య మహాసభ ప్రచార కార్యదర్శిగా వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లుకు నియామకపత్రాన్ని అందజేస్తున్న అమరవాది లక్ష్మీనారాయణ

**సైఫాబాద్, జూన్ 12 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా రాచమల్ల వెంకటేశ్వర్లు నియమితులైనారు. ఈ మేరకు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆర్య వైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానని, అన్ని రంగాలతోపాటు రాజకీయ రంగంలో ఎదగడానికి మహాసభ త్వరలో కార్యచరణ రూపొందించి అమలు చేస్తుందన్నారు. అలాగే పేద ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం ఆర్యవైశ్య కార్పోరేషన్ కృషి చేసే విధంగా పనిచేయనున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్యులకు సేవలు చేసే అవకాశాన్ని కల్పించిన అమరవాది లక్ష్మీనారాయణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ మాస్టర్ ప్లాన్ చీఫ్ ఇంజనీర్‌గా బాధ్యతలు స్వీకరించిన కామేష్‌ను శుక్రవారం విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ మర్యాదపూర్వకంగా కలిసింది. ఈమేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య, డిస్కం సెక్రటరీలు, వెంకటేశ్వర్లు తదితరులు కామేష్ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈసందర్భంగా విద్యుత్ సంస్థలోని పలుఅంశాలపై చర్చించారు.

# సమస్యలు పరిష్కరించాలని జడ్‌సికి వినతి

**నార్సింగి, జూన్ 12 ప్రభాతవార్త :** మణికొండలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ది సిటిజెన్స్ కౌన్సిల్ ప్రతినిధుల బృందం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ది సిటిజెన్స్ కౌన్సిల్ అధ్యక్షులు ఉపేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ మణికొండ అంజలి గార్డెన్స్‌లో డ్రైనేజీ లైన్ నిర్మాణం, రోడ్ల అభివృద్ధి, వీధి దీపాల మరమ్మతులు చేయాలని, పంచవటి కాలనీలో డీలిమిటేషన్ సమస్యలు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని జడ్‌సికి కోరామని తెలిపారు. మణికొండ, నెక్నాంపూర్ డివిజన్ల పరిధిలో వీధి దీపాలకు మరమ్మత్తులు చేయించాలని, రోడ్లు, డ్రైనేజీ పనులు చేయించాలని వినతిపత్రంలో కోరామన్నారు. అల్కాపూర్ టౌన్‌షిప్ సెక్టార్-2లో వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, పయనీర్ ఎస్టేట్‌లో పార్కులు, డ్రైనేజీ, వీధి దీపాల నిర్వాహణ మెరుగు పర్చాలని, శ్రీవేంకటేశ్వర కాలనీ ప్రధాన ద్వారం వద్ద వరద నీటి సమస్య, రహదారి నిర్మాణం, డివైడర్ అభివృద్ధి, హైడ్రా పునరుద్దరించిన రహదారిపై వీధి దీపాల ఏర్పాటు, ఖాళీ ప్రాంతాల అభివృద్ధిని చేపట్టాలని, పాపాకాలనీ, గోల్కొండ హిల్స్, గోల్డెన్‌వ్యూ కాలనీలలో పార్కులు, వీధి దీపాలు, వరద ముప్పు, డ్రైనేజీ పనులు చేయాలని కోరినట్లు ఉపేంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, సత్వరమే పరిష్కరించాలని కోరామని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ది సిటిజెన్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఆరీఫ్ మహ్మద్ తదితరులు ఉన్నారు.



మణికొండలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జడ్‌సికి వినతిపత్రం అందజేస్తున్న ది సిటిజెన్స్ కౌన్సిల్ అధ్యక్షులు ఉపేంద్రనాథ్‌రెడ్డి.

# కొంపల్లి వాసుల సమస్యలపై కెటిఆర్‌కు వినతి

**కొంపల్లి, జూన్ 12, ప్రభాతవార్త**

కొంపల్లి సర్కిల్ పరిధిలోని శ్వేతా శుభం రెసిడెన్సీకి చెందిన ఐటీ ఉద్యోగులు, నివాసితులు బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నంది నగర్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా నివాసితులు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా జరిగేదని, ప్రస్తుతం ఐదు రోజులకు ఒకసారి కూడా తక్కువ ఒత్తిడితో నీరు వస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. అలాగే బోయిన్‌పల్లి, సుచిత్ర, కొంపల్లి, మేడ్చల్ మార్గంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పర్యవేక్షణ లోపంతో గత రెండేళ్లుగా నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మెట్రో విస్తరణలో భాగంగా కొంపల్లి మీదుగా మేడ్చల్ వరకు మెట్రో తీసుకువస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి పురోగతి కనిపించడం లేదని, రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ అంశాలపై ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



అసెంబ్లీతో పాటు పలు వేదికలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించినా స్పందన లేదని తెలిపారు. వారి సమస్యలపై స్పందించిన కేటీఆర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేల కోట్ల రూపాయలతో హైదరాబాద్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చి పెట్టుబడులను ఆకర్షించామని అన్నారు. ప్రస్తుతం మౌలిక వసతుల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. శ్వేతా శుభం రెసిడెన్సీ వాసులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య, నిలిచిపోయిన ఫ్లైఓవర్ పనులు, ఉత్తర హైదరాబాద్‌కు మెట్రో విస్తరణ వంటి అంశాలపై ప్రజల తరఫున పోరాటం కొనసాగించి పరిష్కారం సాధిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు.

## ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే తలసాని

**సికింద్రాబాద్, జూన్ 12 ప్రభాతవార్త:** ప్రజల అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. శుక్రవారం పద్మారావు నగర్ లో 40 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టే మంజీరా వాటర్ పైప్ లైన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనత్ నగర్ నియోజకవర్గం లో 2014 తర్వాతనే బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కోట్లాది రూపాయల విలువైన అనేక అభివృద్ధి పనులు జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో సరైన రోడ్లు ఉండేవి కాదని, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక రోడ్లపై మురుగునీరు ప్రవహిించేదని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా వచ్చిన తర్వాత అన్ని రోడ్లను ఎంతో అభివృద్ధి చేశామని, డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించామని తెలిపారు. ప్రజల త్రాగునీటి అవసరాలను తీర్చేందుకు అనేక ప్రాంతాలలో నూతన పైప్ లైన్‌ల ఏర్పాటు, రిజర్వాయర్‌ల నిర్మాణం చేసిన విషయాన్ని వివరించారు. తాను నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని వాటి



తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని

పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ దీబీలీ వెంకట్ రెడ్డి, పద్మారావు నగర్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, బన్సీలాల్ పేట డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, వాటర్ వర్క్స్ మేనేజర్ శ్రీనివాస్, జీహెచ్ఎంసీ ఏఈ మురళి, ఎలెక్ట్రిసిటీ ఏఈ రాజు, హార్టికల్చర్ అధికారి సత్యనారాయణ, నాయకులు లక్ష్మీపతి, ఏసూరి మహేష్, అంబులెన్స్ సురేష్, బాల్ రెడ్డి, ప్రేమ్, శ్రీకాంత్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మహేందర్ గౌడ్, పుశ్యంత్ రెడ్డి, కుషాల్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డును ప్రారంభించిన కాలేరు వెంకటేష్



అంబర్‌పేటలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, చిత్రంలో మాజీ కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్ జూన్ 12 ప్రభాతవార్త**

అంబర్‌పేట్ డివిజన్‌లో రూ.84 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. అంబర్‌పేట్ డివిజన్ పరిధిలోని అనికేఫ్ చౌరస్తా నుండి వాటర్ వర్క్స్ గేట్ వరకు రూ.84 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును కాలేరు వెంకటేష్ ప్రారంభించించి అనంతరం ప్రజలను నేరుగా కలుసుకున్నారు. ఈ ప్రాంత ప్రజలు గత 30 సంవత్సరాలుగా రోడ్డు సమస్యల కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త సీసీ రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలగనుండటంతో వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ రోడ్డు నిర్మాణం తమ చిరకాల కోరిక నెరవేరినట్టుగా భావిస్తూ ఎమ్మెల్యేకు, సంబంధిత అధికారులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట డివిజన్ మాజీ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, అధికారులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

## అనాధాశ్రమ విద్యార్థులకు రూ.10 వేల ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**నిజాంపేట్, జూన్ 12, ప్రభాతవార్త**

హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జీడిమెట్ల సుభాష్‌నగర్‌లోని కృపా చిల్డ్రన్ హోమ్ అనాధాశ్రమానికి శుక్రవారం విద్యార్థుల విద్యా అవసరాల కోసం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్ తెలిపిన వివరాల ప్రకారం, విద్యుత్ శాఖలో సహాయ ఇంజనీర్ (విరమణ పొందిన)గా పనిచేసిన కె. జీవన్ బాబు సహకారంతో ఈ నిధులను అందజేశారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ కొనుగోలుకు ఈ ఆర్థిక సహాయం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అనాధాశ్రమ నిర్వాహకురాలు పద్మ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి చేయూతనందించిన కె. జీవన్ బాబు, హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలోని దాతలు, సేవా సంస్థలు ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ద్వారా అనాధ పిల్లల భవిష్యత్తుకు బలమైన అండగా నిలవవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై బిఎల్‌ఏలకు శిక్షణ

**కొంపల్లి, జూన్ 12, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లిలో టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై బూత్ స్థాయి ఏజెంట్లకు (బీఎల్ఏలు) అవగాహన, శిక్షణ శిబిరం శుక్రవారం ఎస్ఎన్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ శిక్షణ శిబిరంలో ఎస్ఐఆర్ పరిశీలకుడు, తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మైపాల్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమన్వయకర్త ఏపీ మిథున్ రెడ్డి పాల్గొని కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలంటే ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు ప్రజలతో నిరంతరం మమేకమవుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి భూపతి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ ప్రోటోకాల్ ఉపాధ్యక్షుడు బొంగునూరి కిషోర్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి, నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ నాయకులు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ రవాణా కాంట్రాక్టులు, చెల్లింపుల అక్రమాలపై ఫిర్యాదు

**నిజాంపేట్, జూన్ 12, ప్రభాతవార్త**

నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో డంపింగ్ యార్డ్ నుండి జవహర్‌నగర్‌కు చెత్త రవాణా కాంట్రాక్టులు, బిల్లుల చెల్లింపులు, నకిలీ పత్రాల సృష్టి, ప్రజాధన దుర్వినియోగం జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ శుక్రవారం సిఎంసి కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ తెలిపారు. 2023 నుండి 2025 మధ్యకాలంలో చెత్త రవాణా కాంట్రాక్టులకు సంబంధించి సుమారు రూ.3.40 కోట్ల చెల్లింపుల్లో అక్రమాలు జరిగి ఉండవచ్చని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. అసలు కాంట్రాక్టర్ కె. చంద్రశేఖర్‌కు చెల్లించాల్సిన నిధులు నకిలీ సంస్థ ద్వారా మళ్లించబడ్డాయనే ఆరోపణలపై విచారణ జరపాలని కోరినట్లు తెలిపారు. ఫిర్యాదులో అప్పటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ధీరజ్ కుమార్ (ప్రస్తుతం డిప్యూటీ ఇంజనీర్, శేరిలింగంపల్లి), మాజీ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, ప్రస్తుత డిప్యూటీ కమిషనర్ సబీర్ అలీ, ఇతర సంబంధిత అధికారుల పాత్రపై సమగ్ర విచారణ నిర్వహించాలని కోరినట్లు పేర్కొన్నారు. డంపింగ్ యార్డ్ రవాణా కాంట్రాక్టులు, టెండర్ ప్రక్రియ, బిల్లుల చెల్లింపులు, మెజర్‌మెంట్ బుక్స్, జీఎస్టీ నమోదులు, బ్యాంకు ఖాతా వివరాలు సహా అన్ని సంబంధిత రికార్డులను పరిశీలించి నిజానిజాలను వెలుగులోకి తీసుకురావాలని ఆయన కోరారు. ప్రజాధనం దుర్వినియోగం జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ నిధులను తిరిగి రికవరీ చేయాలని ఫిర్యాదులో కోరినట్లు తెలిపారు.

# కనీస వేతనాల తగ్గింపును పునఃసమీక్షించకపోతే ఆందోళన

**చిక్కడపల్లి జూన్ 12 ( ప్రభాతవార్త ) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల సవరణ పేరుతో కార్మికుల వేతనాలను తగ్గించడం పట్ల భారత్ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బిఆర్టీయు) తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. శుక్రవారం బాగ్ లింగంపల్లి బిఆర్టీయు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు జి. రాంబాబు యాదవ్ మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం సుమారు కోటి 11 లక్షల మంది కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం పెంచిన కనీస వేతనాల కంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం వేతనాలను తగ్గించిందని ఆయన పేర్కొన్నారు. 2017లో కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నిర్ణయించిన వేతనాల కంటే, 2026లో ప్రస్తుత ప్రభుత్వం పెంచిన వేతనాలు తక్కువగా ఉన్నాయని ఆయన విమర్శించారు. కార్మిక శాఖ, క్యాబినెట్ సబ్‌కమిటీ , కనీస వేతనాల సలహా మండలి పెరుగుతున్న ధరలను, కార్మికుల జీవన స్థితిగతులను పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. డాక్టర్ అట్రాయిడ్ ఫార్ములాను 1991 నాటి సుప్రీంకోర్టు తీర్పును ఈ ప్రభుత్వం విస్మరించిందని ఆయన అన్నారు. గతంలో రాష్ట్రమంతా ఒకే రకమైన వేతనాలు అమలులో ఉండగా, ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి కార్మికుల వేతనాల కోతకు కారణమైందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆర్భాటంగా చేసిన కనీస వేతనాల సవరణను వెంటనే ఉపసంహరించుకోవాలని, గతంలో మాదిరిగానే వేతనాలను పెంచాలని బిఆర్టీయు డిమాండ్ చేస్తోంది. కార్మికులం దరూ వేతనాల తగ్గింపును వ్యతిరేకించాలని, వేతనాల పునఃసమీక్ష కోసం ఉద్యమించాలని రాంబాబు యాదవ్ పిలుపునిచ్చారు.




వివరాలు వెల్లడిస్తున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్

## ఖమ్మం మైనర్ బాలికపై లైంగిక దాడి నిందితుడికి కఠిన శిక్ష పడాలి

**-ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటుకు ప్రజాసంఘాల డిమాండ్**

**-మహిళా కమిషన్‌కు వినతిపత్రం**

**చిక్కడపల్లి జూన్ 12 ( ప్రభాతవార్త ) :** ఖమ్మం నగరంలోని రాపర్తినగర్‌లో జరిగిన మైనర్ బాలికపై అత్యాచారం, హత్యాయత్నం ఘటనపై ప్రజాసంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. నిందితుడు మహమ్మద్ గౌస్‌పాషాపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ సుందరయ్య పార్క్ వద్ద భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా, ఆవాజ్, గిరిజన సంఘం, డీవైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్, రజక వృత్తిదారుల సంఘం నాయకులు మల్లు లక్ష్మి, ఎండీ అబ్బాస్, ఆర్.శ్రీరామ్ నాయక్, ఆనగంటి వెంకటేష్, బొప్పని పద్మ, మహేందర్, మిర్యాల గోపాల్ తదితరులు మాట్లాడుతూ.. నిరుపేద మైనర్ బాలికపై అమానుషంగా అత్యాచారం చేసి, ఆపై నాలుగో అంతస్తు నుంచి తోసేసి హత్యకు యత్నించిన నిందితుడిని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలకు, చిన్నారిలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ప్రజాసంఘాలు ఆరోపించాయి. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని, బాధితురాలి కుటుంబానికి కోటి రూపాయల ఆర్థిక సాయం, భద్రత కల్పించాలని కోరారు. నిరసన అనంతరం రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.అరుణ జ్యోతి, ధర్మానాయక్, కోట రమేష్, కృష్ణనాయక్, శశికళ, కవిత, రజిత, సంగీత, సోమయ్య, నరేష్, వెంకన్న, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి రాష్ట్ర 4వ మహాసభల లోగో ఆవిష్కరణ




లోగోను ఆవిష్కరిస్తున్న ఎఐటియుసి నేతలు యూసఫ్, బాల్‌రాజ్, వి.ఎస్.బోస్, నర్సింహ్మా, వెంకటేశం, ప్రవీణ్‌కుమార్‌గౌడ్, శ్రీనివాసమూర్తి తదితరులు

**సైఫాబాద్, జూన్ 12 ప్రభాతవార్త:** ఆల్ ఇండియా ట్రైడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు కరీంనగర్ పట్టణంలో సెప్టెంబరు 6వ తేదీ నుంచి 8 వరకు జరగనున్నాయి. దీనికి సంబందించిన 'లోగో'ను శుక్రవారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ యూసఫ్, ఎస్.బాల్‌రాజ్, సీనియర్ నాయకుడు వి.ఎస్.బోస్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా, కార్యదర్శులు బి.వెంకటేశం, మారగోని ప్రవీణ్‌కుమార్‌గౌడ్, తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీనివాసమూర్తి తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూసఫ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన 4 లేబర్‌కోడ్‌లపై ఈ మహాసభలలో చర్చించి మరింతగా ఉధృతమైన పోరాటాలను నిర్ణయించనున్నామని తెలిపారు. కార్మిక సంఘాలు ఎన్నో పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతన సవరణ చేపట్టి నామమాత్రంగా పెంచి వాటిని జూన్ 1వ తేదీనుంచి అమలులోకి తీసుకువచ్చిందని, దీనిపైన కూడా మహాసభల్లో చర్చించి పోరాట కార్యక్రమాలు ఏ పద్ధతుల్లో నిర్వహించాలో నిర్ణయిం తీసుకుంటామన్నారు.

## గండిపేట మండలంలో గుర్తింపులేని పాఠశాలలపై కొరడా

**- ఈ పాఠశాలల్లో పిల్లలను చేర్చవద్దన్న ఎంఇఓ వెంకటేశం**

**నార్సింగి, జూన్ 12 ప్రభాతవార్త :** గండిపేట మండలంలో గుర్తింపు లేని 16.ప్రైవేటు పాఠశాలలపై విద్యాధికారి వెంకటేశం కొరడా ఝులిపించారు. తల్లిదండ్రులు తమ బిడ్డలను ప్రభుత్వం చేత గుర్తింపు పొందిన పాఠశాలల్లోనే చేర్పించాలని, గుర్తింపులేని పాఠశాలల్లో చేర్పించి ఇబ్బందులు పడవద్దని ఎంఇఓ సూచించారు. గండిపేట మండలంలో మొత్తం 16.పాఠశాలలు ఎలాంటి గుర్తింపు లేకుండా నడుస్తున్నట్లు మా విచారణలో తేలిందని, ఆ పాఠశాలలను మూసి వేయించామని, చట్ట ప్రకారం చర్యలు తీసుకున్నామని వివరించారు. ఎడిఫై కిడ్స్ స్కూల్(కిస్మత్‌పూర్), ఐరీస్ ఫోరెట్స్(పిఅండ్‌టీ కాలనీ), యూరోకిడ్స్(హైదర్షాకోట్), నేచర్ కిడ్స్ అకాడమి (హైదరాషాకోట్), బిగినర్స్ వరల్డ్ ప్రీ స్కూల్(గంధంగూడ), జెనిసిస్ డేకేర్ ప్లే స్కూల్, లిటిల్ కిడ్జ్(బండ్లగూడ), లిటిల్ బ్లూమ్స్ (గంధంగూడ), హ్యాప్పీ హోపర్స్, భాస్కర స్కూల్(మణికొండ), సిస్ట్లా స్కూల్(మణికొండ), స్నాగుల్‌బగ్స్ (మణికొండ), బాసిల్‌వుడ్(నెక్‌నాంపూర్), నానోఅకాడమి(సన్‌సిటీ బండ్లగూడ), నైన్ అకాడమి(నార్సింగి), ఎస్ఆర్ అకాడమి(నార్సింగి) పాఠశాలలను మూసి వేశామని గండిపేట మండల విద్యాధికారి కె.వెంకటేశం వివరించారు.

## దారిదోపిడీ కేసులో ముగ్గురు నిందితులకు శిక్ష..

**కార్వాన్, జూన్12(ప్రభాతవార్త)**

కుల్సుంపుర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఒక దారిదోపిడీ కేసులో నిందితులుగా ఉన్న ముగ్గురు వ్యక్తులకు నేరం రుజువు కావడంతో న్యాయస్థానం రెండేళ్ల కఠిన కారాగార శిక్ష,జరిమానా విధిస్తూ సంచలన తీర్పు వెల్లడించింది. గత ఏడాది జియాగూడలోని100 ఫీట్ రోడ్డు సమీపంలో ముగ్గురు వ్యక్తులు ఫిర్యాదుదారుడిని కత్తితో బెదిరించి, ఒక శామ్‌సంగ్ మొబైల్ ఫోన్ మరియు రూ.5,వెల నగదును బలవంతంగా దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కుల్సుంపుర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు అధికారి గోల్కొండ జోన్ కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ ఎమ్.వరప్రసాద్ దర్యాప్తులో నిందితులు ఏ1గా మహ్మద్ ముబీన్, ఏ2గా మహ్మద్ ముజఫర్ అలీ ఖాన్‌లను అదుపులోకి తీసుకోగా, పరారీలో ఉన్న ఏ13 మహ్మద్ షాఫైజ్ పటేల్‌తో కలిసి ఈ నేరానికి పాల్పడినట్లు అంగీకరించారు. నిందితుల నుండి చోరీకి గురైన మొబైల్ ఫోన్, నేరానికి ఉపయోగించిన మోటార్ సైకిల్ మరియు కత్తిని పంచనామా సమక్షంలో రికవరీ చేశారు. న్యాయమూర్తి జి.ప్రభాకర్ కేసును సమగ్రంగా విచారించి తీర్పునిస్తూ..నిందితులు మహ్మద్ ముబీన్, మహ్మద్ ముజఫర్ అలీ ఖాన్, మహ్మద్ షాఫైజ్ పటేల్‌లను దోషులుగా నిర్ధారించి, ముగ్గురు నిందితులకు 2 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, 100రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఒక నెల సాధారణ శిక్ష అనుభవించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

**చార్మినార్, జూన్ 12 ప్రభాతవార్త :** భార్యపై అనుమానంతో ఓ భర్త కత్తితో దాడి చేసి గొంతు కోసి భార్యను అతి దారుణంగా హత్య చేసిన భర్తను బహదూర్‌పుర పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బహదూర్‌పుర పోలీసులు తెలిపిన వివరాలు కథనం ప్రకారం.....పాతబస్తీ కిషన్‌బాగ్‌కు చెందిన సులేమాన్ సయ్యద్ అలియాస్ సులేమాన్ (32) భార్య నిషాద్ ఫాతిమా (30)పై అనుమానంతో గొడవ పడుతుండేవాడు. కాగా లోక్ అధాలత్‌లో ఇద్దరి మధ్య రాజీ కుదరటంతో మళ్లీ ఇద్దరు కలిసి ఉంటున్నప్పటికి భర్త సులేమాన్‌లో మార్పు రాలేదు. ఏలాగైనా భార్య నిషాద్ ఫాతిమాను చంపాలని సులేమాన్ నిర్ణయించుకున్నాడు. ఈ నెల 7వ తేదీన నిషాద్ ఫాతిమా ఇంట్లో గాఢ నిద్రలో ఉన్న సమయంలో భర్త సులేమాన్ వంటగదిలో దాచిన కత్తితో దాడి చేసి గొంతు కోశాడు. ఈసంఘటనలో భార్య నిషాద్ ఫాతిమా సంఘటన స్థలం లోనే మృతి చెందింది. భార్యను హత్య చేసిన భర్త సులేమాన్ సయ్యద్ అలియాస్‌నుపోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును బహదూర్‌పుర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## బాలికపై లైంగికదాడికి యత్నం

**- పోక్సో కేసు నమోదు చేసిన పంజాగుట్ట పోలీసులు**

**జూబ్లీహిల్స్, జూన్ 12, ప్రభాతవార్త:**

మైనర్ బాలికపై ఒక వ్యక్తి లైంగిక దాడికి యత్నించిన సంఘటన పంజాగుట్ట ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. పంజాగుట్ట ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఒక భవనంలో కార్మికులుగా పనిచేస్తున్న ఒక మహిళ అక్కడే తన కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తుంది. అదే ప్రదేశంలో వంటమనిషిగా పనిచేస్తున్న శంభు అనే వ్యక్తి నివసిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం సమయంలో బాలిక ఇతర పిల్లలతో కలిసి నివాస ప్రాంతంలో ఉండగా, శంభు గదిలోకి వెళ్లి బాలికపై లైంగిక దాడికి యత్నించాడు. బాలిక గట్టిగా ఏడవడంతో సమీపంలో ఉన్న మహిళ అప్రమత్తమై తలుపు కొట్టగా నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రుణం పేరుతో రూ. 2.50 లక్షల మోసం

**జూబ్లీహిల్స్, జూన్ 12, ప్రభాతవార్త:**

రుణం ఇప్పిస్తానని చెప్పి నమ్మించి ఒక మహిళ నుంచి రూ.2.5 లక్షల కాజేసిన వ్యక్తిపై పంజాగుట్ట ఠాణాలో కేసు నమోదైంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. పంజాగుట్టలోని అతిథి లోన్స్ సంస్థ యజమాని సంగమేశ్వర్ తనకు పలు రుణ సంస్థలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని సికింద్రాబాద్ ఈస్ట్ మారేడ్‌పల్లికి చెందిన పద్మావతి అనే మహిళను నమ్మించాడు. ఆమె ఆస్తిపై రూ.40 లక్షల రుణం మంజూరు చేయిస్తానని హామీనిచ్చాడు. అతని మాటలు నమ్మిన పద్మావతి తొలుత ప్రాసెసింగ్ ఫీజు కోసం రూ. లక్ష చెల్లించింది. అనంతరం ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్ పేరుతో నకిలీ రుణ మంజూరు ఉత్తర్వును అందజేసి మరో రూ.1.50 లక్షలు వసూలు చేశాడు. రెండు రోజుల్లో రుణం జమ అవుతుందని నమ్మించాడు. రుణానికి సంబంధించిన డబ్బులు రాకపోవడంతో ఆరా తీయగా రుణపత్రం నకిలీదని తేలింది. దీంతో బాధితురాలు పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పరిచయాలున్నాయని రూ. 13 లక్షలు కాజేశాడు

**జూబ్లీహిల్స్, జూన్ 12, ప్రభాతవార్త:**

ఆభరణాల దుకాణంలో తనకు పరిచయాలున్నాయని, తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానని స్నేహం ముసుగులో ఒక కుటుంబాన్ని మోసగించి రూ. 13.18లక్షలు కాజేసిన వ్యక్తిపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. ఖాజాగూడకు చెందిన కొండూరు తేజస్వి భర్తకు స్నేహితుడైన హర్ష రాయల్ తరచూ వారి ఇంటికి వచ్చేవాడు. తేజస్వి కుమార్తె యోక్షిత పుట్టినరోజు సందర్భంగా బంగారు ఆభరణాలు కొనుగోలు చేయాలని దంపతులు భావించారు. ఈ నేపథ్యంలో తమ స్నేహితుడైన హర్ష రాయల్‌ను సంప్రదించారు. లలిత జ్యువెలర్స్‌లో తనకు పరిచయాలు ఉన్నాయని, తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానని అతడు వారిద్దరిని నమ్మించాడు. జూన్ 6న తేజస్వి పంజాగుట్టలోని లలిత జ్యువెలర్స్‌కు వెళ్లగా, అక్కడికి వచ్చిన హర్ష రాయల్ ఆమె నుంచి రూ.13,18,500 నగదు తీసుకున్నాడు. అనంతరం మరో వ్యక్తికి ఆ డబ్బు ఇచ్చి 100 గ్రాముల బంగారు బిస్కెట్ తీసుకురావాలని చెప్పాడు. కొంతసేపటి తర్వాత తానే బంగారం తీసుకొస్తానని చెప్పి అక్కడి నుంచి నెమ్మదిగా జారుకున్నాడు. హర్ష ఎంతకూ తిరిగి రాకపోవడంతో వారికి అనుమానం వచ్చి చూడగా అతను కనిపించలేదు. ఫోన్ సైతం అందుబాటులో లేదు. దీంతో తేజస్వి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పురుషోత్తమ మాసాన్ని పురస్కరించుకొని కేశవగిరి శ్రీ రామాలయంలో ప్రధాన అర్చకులు పరాంకుశం సుధీర్‌కుమారాచార్యుల ఆధ్వర్యంలో శుక్రవారం ఛండీ యజ్ఞం, వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు ఎం.ప్రభాకర్‌రాజ్ ముదిరాజ్, అర్చకులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

## ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతిగా డా. నాగ మోహన్



సూపరింటెండెంట్ డా.వాణిని మర్యాదపూర్వకంగా కలిసిన నాగమోహన్‌రావు

**సికింద్రాబాద్, జూన్ 12 ప్రభాతవార్త:** గాంధీ మెడికల్ కళాశాల, సికింద్రాబాద్‌లో ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డా. బి.వి. నాగ మోహన్ రావు గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వాణిని ఆస్పత్రి భవనంలోని ఆమే చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డా. నాగ మోహన్ రావు ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం అభివృద్ధి, విద్యార్థులకు నాణ్యమైన బోధన, మెడికోలీగల్ సేవల మెరుగుదల, విభాగానికి సంబంధించిన భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

## కలెక్టర్‌ను సత్కరించిన విజయ రెడ్డి



**ఖైరతాబాద్, జూన్ 12, (ప్రభాతవార్త):** హైదరాబాద్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రియాంక అలని ఖైరతాబాద్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ పి. విజయ రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు, నగర మౌలిక వసతుల మెరుగుదల వంటి అంశాలపై చర్చించారు. ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించేందుకు కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని విజయ రెడ్డి కోరారు. హైదరాబాద్ జిల్లా సమగ్ర అభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆమె పేర్కొన్నారు. నూతన బాధ్యతల్లో కలెక్టర్ ప్రియాంక అల విజయవంతంగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని ఆకాంక్షించారు.

## దశాబ్దం గడిచినా ఖైరతాబాద్ వార్డు కార్యాలయానికి నోచని పునర్నిర్మాణం

**ఖైరతాబాద్, జూన్ 12, (ప్రభాతవార్త):** ఖైరతాబాద్‌లోని బల్దియా వార్డు కార్యాలయ భవనాన్ని దాదాపు పదేళ్ల క్రితం కూల్చివేసినప్పటికీ, ఇప్పటి వరకు కొత్త భవనం నిర్మాణం చేపట్టకపోవడం స్థానికుల్లో అసంతృప్తికి కారణమవుతోంది. కూల్చివేసిన స్థలం నేటికీ ఖాళీగానే ఉండగా, వార్డు కార్యాలయానికి సంబంధించిన పరిపాలనా కార్యకలాపాలు ఎదురుగా ఉన్న కమ్యూనిటీ హాల్‌లోనే కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పాత భవనాన్ని తొలగించినప్పటికీ, అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం కూడా కొత్త కార్యాలయ నిర్మాణంపై దృష్టి సారించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన కీలక పౌర సేవలు తాత్కాలిక ఏర్పాట్ల మధ్య కొనసాగడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వార్డు కార్యాలయ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. గతంలో ఈ కార్యాలయంలో ఎన్నికల సమయంలో రెండు పోలింగ్ కేంద్రాలు కూడా ఏర్పాటు చేసేవారని స్థానికులు గుర్తుచేస్తున్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలంటే ఖైరతాబాద్ వార్డు కార్యాలయ పునర్నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## అనారోగ్య బాధితులను పరామర్శించిన శంభీపూర్ కృష్ణ



**దుండిగల్, జూన్ 12, ప్రభాతవార్త** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ పరిధిలోని గాగిల్లాపూర్ తాండా, దుండిగల్ తాండాలకు చెందిన పలువురు అనారోగ్య బాధితులను బీఆర్ఎస్ నేత శంభీపూర్ కృష్ణ పరామర్శించారు. మాజీ కౌన్సిలర్ కొర్ర శంకర్ నాయక్‌తో కలిసి బాధితుల ఇళ్లకు వెళ్లిన ఆయన, ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న బీఆర్ఎస్ కార్యకర్త జగన్ నాయక్, కిడ్నీ, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న కాట్రోత్ లక్ష్మణ్ నాయక్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని శంభీపూర్ కృష్ణ భరోసా ఇచ్చారు. అనంతరం కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న లక్ష్మిబాయి, ఫకీరా రాజులను కూడా వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా వాయు కాలుష్యం, కలుషితమైన తాగునీటి కారణంగా తాండా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, స్వచ్ఛమైన మంచినీటి సౌకర్యం కల్పించి ప్రజలను ఆదుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో వార్డ్ అధ్యక్షుడు అమర్ సింగ్ నాయక్, వెంకటేష్ నాయక్, ప్రవీణ్ నాయక్, హనుమంతు, నర్సింగ్ నాయక్, కుమార్ నాయక్, రాజు నాయక్, వాసు నాయక్, పటేల్ రెడ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కుల పంపిణీ




చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ

**చాంద్రాయణగుట్ట, జూన్ 12, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని చాంద్రాయణగుట్ట శాసనసభ్యులు అక్బరుద్దీన్ ఓవైసీ కోరారు. శుక్రవారం బండ్లగూడలోని బారిస్టర్ ఫాతిమా ఓవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్ ఆవరణలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం, అభ్యున్నతికి మజ్లిస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. తమ ప్రజా ప్రతినిధులు ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. సుమారు రూ.25.43 కోట్ల రూపాయల విలువ చేసే 2,541 చెక్కులను పంపిణీ చేశారు. 2014-26 వరకు చాంద్రాయణగుట్ట నియోజక వర్గంలో దాదాపు రూ. 350.66 కోట్ల విలువ చేసే 41,051 కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను అందజేసినట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## స్థానిక ఎమ్మెల్యే భూ ఆక్రమణదారులతో కుమ్మక్కయ్యారు : బిఆర్ఎస్



మీడియాతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్

**కంటోన్మెంట్, జూన్ 12 ప్రభాతవార్త:** తిరుమలగిరి మండలం బోయిన్ పల్లి, చిన్నతో కట్ట లోని సర్వేనెంబర్ 157/1 లో ఉన్న 8 ఎకరాల ప్రభుత్వ ఖాళీ స్థలం అన్యాక్రాంతం అవుతున్న స్థానిక ఎమ్మెల్యే భూ ఆక్రమణదారులతో కుమ్మక్కయ్యారని బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జల నాగేష్ లు ఆరోపించారు. శుక్రవారం బోయిన్ పల్లి, ఎన్ఐఎం హెచ్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలం ను కొందరు ప్రైవేట్ వ్యక్తులు కంటోన్మెంట్ బోర్డు సీఈఓ అనుమతి తీసుకుని వారం రోజుల నుంచి బ్లూ షీట్స్ తో కంచెను ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న మన్నె కిశాంక్ శుక్రవారం ఆ స్థలం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోయిన్ పల్లి మార్కెట్ కు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న 8 ఎకరాల ఖాళీ స్థలం విలువ దాదాపు 400 కోట్ల రూపాయల విలువ చేసే స్థలంలో 6 వేల మందికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే శ్రీ గణేష్ గత అక్టోబర్ నెల 12వ తేదీన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వ సలహాదారులు ఎంపీ వేం నరేందర్ రెడ్డి మంత్రి సీతక్కలను కలిసి వినతి పత్రం అందజేసి ప్రభుత్వాన్ని ఒప్పించారు. పది నెలల్లోనే ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి ఎలా వెళ్లిందని ప్రశ్నించారు. ఎమ్మెల్యే భూ ఆక్రమణదారులతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. అందువల్ల ఈ స్థలంలో ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకొని కంచెను ఏర్పాటు చేస్తున్న పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ స్థలంపై రెవెన్యూ అధికారులు ఎన్ ఓ సి జారీ చేస్తేనే కంటోన్మెంట్ బోర్డు ప్రహరీ ఏర్పాటు చేసుకొనుటకు అనుమతి ఇవ్వాల్సి ఉంది. అయితే ప్రభుత్వ స్థలాలను పరిరక్షించే రెవెన్యూ అధికారులు ఈ స్థలంపై ఎందుకు చర్యలు చేపట్టడం లేదని అనుమానం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఈ స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వందల కోట్ల రూపాయలు విలువ చేసే ఎనిమిది ఎకరాల ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకోవడం లేదు అన్నారు. అదేవిధంగా కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మద,స్థానిక ఎంపీ ఈటల రాజేందర్ లు ఎందుకు స్పందించడం లేదన్నారు ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ మెంబర్ ప్యారసాని శ్యాం కుమార్ టిఆర్ఎస్ యువ నాయకులు పాల్గొన్నారు

## క్షేత్రస్థాయిలో మన సత్తా నిరూపించుకోవాలి :అరవింద్‌కుమార్ గౌడ్




సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యులు ఎం.అరవింద్‌కుమార్‌గౌడ్

**ముషీరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ తరఫున సీట్లు ఆశించాలంటే, ప్రతి డివిజన్ నుంచి కనీసం 25 నుంచి 50 మంది వరకు యాక్టివ్ కేడర్‌ను సిద్ధం చేసుకుని, క్షేత్రస్థాయిలో మన సత్తా నిరూపించుకోవాలని టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు ఎం.అరవింద్‌కుమార్‌గౌడ్ సూచించారు. శుక్రవారం సికింద్రాబాద్ ముఖ్య నాయకులతో లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నాయకులు నల్లెల్ల కిషోర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. తెలంగాణ తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేసేందుకు, రాబోయే రోజుల్లో తెలంగాణలో సైతం టీడీపీని తిరుగులేని రాజకీయ శక్తిగా మార్చేందుకు ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు ఏ విధంగా కృషి చేయాలో ఆయన దిశా నిర్దేశం చేశారు. రాబోయే ఎన్నికల సమరానికి క్యాడన్ సన్నద్ధం చేయటానికి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అంతర్గత విభేధాలు, వ్యక్తిగత గొడవలకు తావు లేకుండా, పార్టీలో నాయకులంతా కలసి సమిష్టిగా పనిచేస్తూ డివిజన్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయటమే ఏకైక లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో రాజకీయ పొత్తు కుదిరితే పార్టీని నెంబర్ 2 స్థానంలో నిలబెట్టవచ్చునని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి వారం స్థానికంగా సమావేశాలు ఏర్పాటుచేసుకుని, నాయకులు, కార్యకర్తలు అందరూ కలసికట్టుగా ప్రతి డివిజన్‌లో తిరుగుతూ ప్రజలతో మమేకమై, పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పి.బాలరాజ్‌గౌడ్, శ్రీపతి సతీష్, పి.అశోక్, నాయుడు, తడక వినోద్, శ్యాం సుందర్, భాను ప్రకాష్, కరణం కిరణ్, కానూరు జయశ్రీ, బాలజీ గోస్వామి, నర్సింహ, వెంకటేష్‌చౌదరి, సత్తన్న, యాదగిరి పాల్గొన్నారు.

## హీరా ఫెర్టిలిటీ సెంటర్‌ను ప్రారంభించిన స్పీకర్

**కంటోన్మెంట్, జూన్ 12 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లిలోని గుప్తా ఎన్‌క్లేవ్, అశ్విన్ కాలనీలో నూతనంగా ఏర్పాటైన హీరా ఫెర్టిలిటీ సెంటర్‌ను తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో కలిసి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ సికింద్రాబాద్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటైన హీరా ఫెర్టిలిటీ సెంటర్ సంతానం కోసం ఎదురుచూస్తున్న ఎంతో మంది జంటలకు కొత్త ఆశలు నింపుతుందన్నారు. అత్యాధునిక వైద్య సదుపాయాలతో, అనుభవజ్ఞులైన వైద్య బృందంతో ఈ సెంటర్ ప్రజలకు అందుబాటులో ఉండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అంబర్ పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ సుజనా, డాక్టర్ పజిల్ ఉన్నిసా, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు

## బాధిత కుటుంబ సభ్యులకు ఎంబిఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న సీసీఎస్ అధికారి

**కంటోన్మెంట్, జూన్ 12 ప్రభాతవార్త:** రైల్వే ఉద్యోగి, సొసైటీ షేర్‌హోల్డర్ అయిన ఎ. కృష్ణ గురువారం మరణించారు. ఆయనకు సంబంధించిన సొసైటీ రుణ ఖాతాలను పరిశీలించగా, వివిధ రకాల (జనరల్ లోన్, స్పెషల్ లోన్, గోల్డ్ లోన్, టూర్ లోన్ )రుణాలలో మొత్తం రూ.11,65,878/ బకాయి రుణాన్ని సొసైటీ నిబంధనల ప్రకారం మాఫీ చేయబడింది. రుణ మాఫీ అనంతరం సభ్యుని ఖాతాలో చెల్లించవలసిన రూ.7,65,681/ మొత్తాన్ని ఆయన నామినీ అయిన భార్య ఎ. విజయకు చెక్కు ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు అంజయ్య యాదవ్, విఠల్ ముండే, స్వామి, ఏ.రమేష్, సిసిఎస్ స్టాఫ్ పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించడండి: శాంతి శ్రీనివాస్ రెడ్డి



కమిషనర్ వినయ్ క్రిష్ణారెడ్డికి వినతి పత్రం అందిస్తున్న మాజీ కార్పొరేటర్

**అల్వాల్, జూన్ 13 ప్రభాతవార్త:** అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని అల్వాల్ మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి ఎంఎంసి కమీషనర్ వినయ్ క్రిష్ణారెడ్డికి వినతి పత్రం అందించారు. శుక్రవారం ఆమె కమీషనర్‌ను ఆయన కార్యాలయం కులసుకుని సమస్యలుపై చర్చించారు. కాలనీలులో సిసి రోడ్లు, డ్రైనేజీ సమస్యలుతో పాటుగా భారతీనగర్‌లో స్మార్ట్ వాటర్ డ్రైన్ నిర్మించాలని శాంతి శ్రీనివవాస్ రెడ్డి కోరారు. లోతుకుంట వద్ద పెండింగ్‌లో ఉన్న బాక్స్ డ్రైయిన్ నిర్మాణ పనులు విషయాన్ని కమీషనర్ దృష్టికి తెచ్చారు.

## 5న స్టైల్ ఫితారా ఎగ్జిబిషన్




ఫోస్టర్ ఆవిష్కరించిన స్టైల్ ఫితారా ప్రతినిధులు

**గన్‌ఫౌండ్రి, జూన్ 12ప్రభాతవార్త:** మహిళా పారిశ్రామిక వేత్తలను ముఖ్యంగా గృహ అధారిత వ్యాపారులను ప్రోత్సహించడానికి వారికి సాధికారత కల్పించడానికి అంకితమైన జీవనశైలి ప్రదర్శన అయిన స్టైల్ ఫితారా ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నామని ప్రతినిధులు రమారాఠి, మీనల్, వైశాలి, ఇనాని, వినీత బల్దువాలు తెలిపారు. శుక్రవారం కోఠిలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 16,17వ తేదిల్లో రోడ్డు నెంబర్ 12 బంజారాహిల్స్‌లోని కళింగ కల్చరల్ సెంటర్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా సామాజిక సేవకురాలు భగవతి బల్వా,ప్రముఖ కొరియోగ్రాఫర్ బీనా మెహతా విచ్చేసి ప్రారంభిస్తానారు. ఈప్రదర్శనలో భారతదేశం, నలుమూలల,నుండి55పైగా స్టాల్స్ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఫ్యాషన్,అభరణాలు,గృహాలంకరణ,యాక్సెసరీలు,చేతితో తయారు చేసిన ఉత్పత్తులు,మరెన్నో ఉత్పత్తులను అందుబాటులో ఉంటాయన్నారు .స్టైల్‌ఫితారా, మహిళా పారిశ్రామిక వేత్తలకు వారి వ్యాపారాలను వృద్ది చేసుకోవడానికి,గుర్తింపు పొందడానికి వినియోగదారులతో కనెక్ట్ అవ్వడానికి ఉపయోగపడుతుందన్నారు. వ్యాపారానికి అతీతకంగా,స్టైల్‌ఫితరాసామాజిక భాధ్యతకు కట్టుబడి ఉందన్నారు. సేకరించిన నిధులతో కొంత భాగాన్ని స్వచ్చంద సేవా కార్యక్రమాలకు, అవసరంలో ఉన్నవారికి సహాయడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## మహిళ మృతితో ఎక్స్‌ఎల్ ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత

**వైద్యులు నిర్లక్ష్యం మరణానికి కారణమంటూ బంధువులు ఆందోళన**

**అల్వాల్, జూన్ 12 ప్రభాతవార్త:** వేలికి గాయమై ఆసుపత్రికి వచ్చిన మహిళ మరణించడం స్థానికంగా ఉద్రిక్తలకు కారణమైంది. ఒకానోక సందర్భంగా బాధిత మహిళ కుటుంబ సభ్యులు రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. సంఘటనకు సంబంధించి బాధిత మహిళ కుటుంబ సభ్యులు ఆసుపత్రి వర్గాలు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఓల్డ్ అల్వాల్‌లోని ఎక్స్ ఎల్ ఆసుపత్రికి శుక్రవారం మద్యాహ్నం వేలికి గాయం కావడంతో ప్రభావతి అనే మహిళ వైద్యం కోసం వచ్చింది. ఆసుపత్రిలో చేరిన తరువాత బిపి ఎక్కువ కావడంతో వైద్యులు ఇంజక్షన్ ఇచ్చారు. ఇంజన్ ఇచ్చిన కొంత సమయానికి బ్రెయిన్ డెడ్ అయ్యినట్లు వైద్యులు దృవీకరించారు. వేలి గాయం చికిత్స కొసం ఆసుపత్రికి వస్తే ప్రాణాలు తీశారని బాధిత మహిళ కుటుంబ సభ్యులు ఆరోపించారు. వైద్యులు నిర్లక్ష్యమే నిండు ప్రాణాన్ని బలి తీసుకుందని ఆందోళనకు దిగారు. బాధితుల ఆందోళనతో ఓల్డ్‌అల్వాల్ ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఆందోళనకారులకు నచ్చ చెప్పడంతో వారు శాంతించారు.

## మ్యాన్‌హోల్‌లో అస్తిపంజరం లభ్యం..!

**అత్తాపూర్ జూన్ 12,ప్రభాతవార్త :** మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాటేదాన్ ఓల్డ్ కర్నూలు రోడ్డులో మ్యాన్ హోల్స్‌లో అస్తిపంజరం లభించిన ఘటన కలకలం రేపింది. శుక్రవారం జీహెచ్‌ఎంసీ సిబ్బంది కాటేదాన్ ఓల్డ్ కర్నూలు రోడ్డులో మ్యాన్‌హోల్స్ శుభ్రపరిచే పనులు నిర్వహిస్తుండగా, ఒక మ్యాన్‌హోల్‌లో పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో అస్తిపంజరం కనిపించింది. దీంతో అప్రమత్తమైన జీహెచ్‌ఎంసీ అధికారులు వెంటనే మైలార్ దేవ్ పల్లి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించి కేసు నమోదు చేశారు. అనంతరం అస్తిపంజరాన్ని పరీక్షల నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతదేహం పురుషుడిదా లేదా మహిళదా అనే విషయం ఫోరెన్సిక్ పరీక్షలు, దర్యాప్తు అనంతరం మాత్రమే తెలుతుందని పోలీసులు తెలిపారు. అస్తిపంజరం మ్యాన్‌హోల్‌లోకి ఎలా చేరింది, దాని వెనుక ఏమైనా అనుమానాస్పద పరిస్థితులు ఉన్నాయా అనే కోణాల్లో కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

## బేగంపేటలో అక్రమ నిర్మాణాల జోరు...పట్టించుకోని అధికారుల తీరు

**-రెండు ఫ్లోర్లకు అనుమతులు ఉంటే నాలుగు,ఐదు ఫ్లోర్ల నిర్మాణం**

**-స్థానికులు ఫిర్యాదులు చేసినా కన్నెత్తి చూడని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు**



తాతాచారి కాలనీ పార్కు ముందు నిర్మాణంలో ఉన్న అక్రమ నిర్మాణం.

**బేగంపేట జూన్ 12,ప్రభాతవార్త** సనత్‌నగర్ నియోజకవర్గం,కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బేగంపేట డివిజన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు ఇష్టారాజ్యంగా జరుగుతున్నా జీహెచ్ ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమ కట్టడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది. కొన్ని నిర్మాణాలకు రెండు ఫ్లోర్లకు అనుమతులు తీసుకుని మరో రెండు మూడు ఫ్లోర్లు అదనంగా వేస్తున్నా, సంబంధిత శాఖ అధికారులు,సిబ్బంది కళ్లుండి చూడలేని వారుగా మిగిలిపోయారు. అక్రమ నిర్మాణాలపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా అధికారులు మాత్రం తమకేమి పట్టదన్నట్లుగా వ్యవహరించడంపై స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. పేదలు ఒక అడుగు ఇంటి ముందుకు జరిగి నిర్మాణాలు చేసినా,కనీసం మెట్లు వంటివి నిర్మించినా వెంటనే రంగంలోకి దిగి కూల్చివేతలు చేపట్టే టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు అక్రమ నిర్మాణాలను పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఈ అక్రమ నిర్మాణాలకు టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన చైన్‌మెన్ కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. బేగంపేట ప్రకాశంనగర్ డివిజన్ శ్యాంలాల్ బిల్డింగ్,తాతాచారి కాలనీలో 200గజాల స్థలంలో జీప్లస్ 4అంతస్తుల నిర్మాణాన్ని చేపట్టారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం నిర్మాణం జరగాల్సి ఉండగా అలా జరగలేదని స్థానికులు సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా వారు కనీసం సదరు భవనం వద్దకు రాలేదని,నిర్మాణాన్ని పరిశీలించలేదని,స్థానికులు ఆరోపిస్తున్నారు. బిల్డింగ్‌కు సెట్ బ్యాక్స్ లేకపోవడం,పార్కింగ్ సౌకర్యం లేకపోవడాన్ని స్థానికులు ఆక్షేపిస్తున్నారు. భవనానికి అనుమతులు ఎలా వచ్చాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బేగంపేట పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పలు అక్రమ నిర్మాణాల విషయంలో జీహెచ్‌ఎంసీ,టౌన్‌ప్లానింగ్ అధికారులకు బిల్డర్లకు మధ్య చైన్ మెన్ వారధిలా వ్యవహరిస్తూ అందిన మేర దండుకుంటున్నాడన్న ఆరోపణలు బహిరంగాంగానే వినిపిస్తున్నాయి. ఒక్కో స్లాబుకు ఏరియాని బట్టి ఒక్కో రేటు ఫిక్స్ చేస్తున్నాడన్న విమర్శలున్నాయి. అక్రమ నిర్మాణ దారులను ప్రోత్సహించడంలో భాగంగా ముందు మీరు మీ ఇంటి బయట రంగేసుకోండి. ఆ తర్వాత ఇంటి లోపల పనులు చేసుకోండి అంటూ ప్రోత్సహిస్తున్నారన్న బహిరంగ విమర్శలున్నాయి. అయినా సంబంధిత శాఖా ఉన్నతాధికారులు మాత్రం తమకేమి పట్టదన్నట్లుగా వ్యవహరించడాన్ని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ విషయంపై ,,ప్రభాతవార్త,, బోయిన్ పల్లి డీసీ ధాకూనాయక్‌కు వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు. ఈ విషయంపై బీజేపీ నేత నెమలి ఆనంద్ జీహెచ్‌ఎంసీ జడ్ సీ,డీసీలకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా ఇంత వరకు స్పందనలేదని నెమలి ఆనంద్ ఆరోపించారు.

## మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై మహిళా కాంగ్రెస్ నిరసన



మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు నిరసన వ్యక్తం చేస్తున్న శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్, చిత్రంలో జ్యోతి భీమ్‌భరత్, ఆర్.లక్ష్మి, పి.కవిత, సుగుణ రెడ్డి తదితరులు

**హైదరాబాద్, జూన్ 12 ప్రభాతవార్త** ఏఐసీసీ పరిశీలకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై శుక్రవారం మహిళా కాంగ్రెస్ నిరసన వ్యక్తం చేసింది. తెలంగాణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆదేశాల మేరకు మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు నిరసనగా మహిళా కాంగ్రె స్ నాయకులు గాంధీ భవన్‌లో సంఘీభావ కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్య విలువలు ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా సాధికారత పేరు తో "బేటీ బచావో - బేటీ పడావో" నినాదాలు ఇస్తున్న బీజేపీ ప్రభుత్వం, ఆచరణలో మాత్రం మహిళల పట్ల వివక్ష చూపుతోం దని విమర్శించారు. మీనాక్షి నటరాజన్‌పై ఎలాంటి బలమైన ఆధారాలు లేని పాత కేసును సాకుగా చూపించి రాజ్యసభ నామినేషన్‌ను తిరస్కరించడం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అని పేర్కొన్నారు. రాజ్యసభలో ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకను అణచివేయడానికే ఈ కుట్ర జరిగిందని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ కరవైందని, ఓటు చోరీతో పాటు ఇప్పుడు సీటు చోరీకి కూడా పాల్పడుతున్నారని విమర్శించారు. గత పదేళ్లుగా బీజేపీ ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీ నపరిచే విధంగా వ్యవహరిస్తోందని, మేధావులు మరియు ప్రజా స్వామ్యవాదులు దీనిపై స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. మీనాక్షి నటరాజన్‌పై నమోదు చేసిన కేసు న్యాయపరంగా నిల వదని, త్వరలోనే అది వీగిపోవడం ఖాయమని మహిళా కాంగ్రె స్ నేతలు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రంగారె డ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్, మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి, సికిం ద్రాబాద్ జిల్లా అధ్యక్షురాలు పి కవిత ,రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుగుణ రెడ్డి , జిల్లా స్థాయి కాంగ్రెస్ మహిళలు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం నిధులు నిజమైన కార్మికులకే అందించాలి..



ఎమ్మెల్యే చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సుబ్బారావు..

**కార్వాన్,జూన్12(ప్రభాతవార్త)** భవన నిర్మాణ కార్మికుల శ్రమతో ఏర్పడిన సంక్షేమ సంఘం నిధులను నిజమైన కార్మికులకే అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని,నకిలీ లేబర్ కార్డుల వ్యవహారాన్ని అరికట్టాలని హైదరాబాద్ భవన,ఇతర నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు కుంచర్ల సుబ్బారావు కార్వాన్ లో భవన,ఇతర నిర్మాణ కార్మికులు,ఇతర అసంఘటిత రంగ కార్మికుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్వాన్ ఎమ్మెల్యే మొహియుద్దీన్ చేతులమీదగా అవార్డు అందుకొన్నారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ..సమాజ అభివృద్ధిలో భవన నిర్మాణ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ,వారి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కార్మికుల నుంచి వసూలు చేస్తున్న సంక్షేమ నిధులను ఇతర అవసరాలకు మళ్లించడం వల్ల కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు ప్రమాదాలు, ఉపాధి అభద్రత,కనీస వేతనాల అమలు లేకపోవడం,ఆరోగ్య సదుపాయాల కొరత,సామాజిక భద్రత లేకపోవడం వంటి సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డుల మంజూరు,పెన్షన్,ప్రసూతి సహాయం,ప్రమాద బీమా,విద్యా సహాయం,గృహ నిర్మాణ సబ్సిడీ వంటి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అలాగే అసంఘటిత రంగ కార్మికులందరికీ సామాజిక భద్రత కల్పించేలా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామారావు తదితరులు పాల్గొన్నారు.

## స్థల వివాదంలో సర్వే నిర్వహించాలని తహశీల్దార్‌కు వినతి

**నిజాంపేట్, జూన్ 12, ప్రభాతవార్త** బాచుపల్లి మండలం నిజాంపేట్ గ్రామ పరిధిలోని సర్వే నెం.334లో ఉన్న జర్నలిస్టు కాలనీలో స్థల వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. శ్రీచైతన్య బాలుర రెసిడెన్షియల్ కళాశాల భవనం సమీపంలో ఉన్న స్థలం విషయంలో కాలనీవాసులు, కొందరు ప్రైవేటు వ్యక్తుల మధ్య వివాదం కొనసాగుతోంది. కాలనీవాసుల అభిప్రాయం ప్రకారం ఆ స్థలం ప్రభుత్వానికి చెందినదిగా ఉండగా, దానిని ప్రజావసరాల కోసం వినియోగించాలని వారు గత కొన్ని సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నారు. అయితే కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆ స్థలానికి తమ వద్ద పట్టా ఉందని పేర్కొంటూ వినియోగించుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థల యాజమాన్యంపై నెలకొన్న సందిగ్ధతను నివృత్తి చేయాలని కోరుతూ కాలనీవాసులు బాచుపల్లి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సంబంధిత రెవెన్యూ అధికారులు తక్షణమే స్థల సర్వే నిర్వహించి, భూమి ప్రభుత్వానిదా లేదా ప్రైవేటు వ్యక్తులదా అనే విషయాన్ని స్పష్టంగా నిర్ధారించాలని వారు కోరారు.

ఒకవేళ ఆ స్థలం ప్రభుత్వ భూమిగా తేలితే ప్రజా అవసరాలకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై అధికారులు త్వరితగతిన స్పందించి వివాదానికి శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.

IN THE COURT THE HON'BLE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT, AT: RAJENDERNAGAR
O.S.NO. 206 OF 2026

BETWEEN:
**U. ESHWARAMMA And others ...PLAINTIFFS**
AND
**THE TAHSILDAR, Rajendranagar Mandal And others ...DEFENDANTS**

**D-3 ALL CONCERNED**

**PUBLIC NOTICE**

The Plaintiffs had filed the above suit for Declaration to Declare the Plaintiffs as Legal Heirs of deceased Uputur Yalamanda in respect of 1/2 undivided share in H.No.6-10-26/1/B/2/1 on Plot bearing No.39/A in Sy No.26/A admeasuring 40 sq.yds or 33.44 sq.mts out of 80 sq.yds with a plinth area: 100 sq.feets (ACC) situated at Katedhan (Shivarampally Village), Rajendranagar Circle, GHMC, Hyderabad, T.S. and bounded on North: Neighbours Plot, South: 18 Feet Wide Road, East: Plot No.39/B, West: 20 Feet Wide Road against the Defendants which includes you. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above suit and the matter is posted to **22.06.2026 at 10.30 a.m.** Therefore, you may appear before the Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law.

(BY ORDER OF THE COURT)
**Sd/- K. SATYANARAYANA GOUD**
**Advocate**
H.No.1-3-33, Budwel, Rajendranagar Mandal, Ranga Reddy District.

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, Rasna Azeez Amit, residing at G201, Sunway Opus 3b, Ameenapur, Miyapur, Hyderabad, declare that my name has been recorded as Rasna Amit in some documents. My correct name is Rasna Azeez Amit and henceforth I shall be known as such for all official purposes. (Ro.No.10127)

FOR SALE

★ 1150 sft apartment for sale @ Malti Naik Plaza Abids 65 lac only, Call 7416393362 or 9573284811. (Ro.No.10165)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ** GHMC

నిట్ నం. 05/EE/Circle-33/GZ/GHMC/2026-27, తేది: 11.06.2026, పని పేరు: 4 సం.లు. BT రోడ్డు, CC రోడ్డు, వరద నీటి డ్రైన్‌ల పనుల యొక్క నిర్వహణ. అంచనా మొత్తం/ECV: రూ.64.25 లక్షలు. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ/చివరి తేదీ & సమయం: 4 పనుల ప్రారంభం 11.06.2026 సా.5.00 గం. వద్ద నుండి/ముగింపు 15.06.2026 ఉ.10.30 గం. వద్ద వరకు, అధికారి పేరు & చిరునామా, సెల్ నం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-33, G.Z, GHMC, అబిడ్స్, ఫోన్: 7032911018, తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://tender.telangana.gov.in వద్ద చూడవచ్చును. కమిషనర్, GHMC. సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-33, (G.Z) GHMC
DIPR.No.4218-PP/CL/Advt/1/2026-27, తేది: 12.06.2026

తెలంగాణ ప్రభుత్వం
**మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్**
నిట్ నం. 29/EE-1/MKJZ/MMC/2026-27

పనిపేరు: నిర్వహణ పనులు ఇతరములు-3. అంచనా మొత్తం : (రూ.లక్షల్లో): 4.95. బిడ్ దాఖలు ప్రారంభ తేదీ & సమయం/బిడ్ దాఖలు ముగింపు తేదీ & సమయం: 11.06.2026 సా.5.00గం., 12.06.2026 & సా. 5.00గం. అధికారి పేరు & చిరునామా, సెల్ నం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 9989930389. తదుపరి వివరాలు. ఇ-ప్రొక్యూర్‌మెంట్ http://www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ I, మల్కాజ్‌గిరి జోన్, MMC.
DIPR.NO. 4142-PP/CL/ADVT/1/2026-27 తేది: 12.06.2026

## అద్విక్ కుటుంబానికి న్యాయం చేయాలి

**: మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి**



జోనల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేస్తున్న సామ, లచ్చిరెడ్డి.

**వనస్థలిపురం. జూన్.12.ప్రభాతవార్త.**

ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ టీచర్స్ కాలనీలో మే 11న కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన చిన్నారి అద్విక్ కుటుంబ సభ్యులను బిజెపి పార్టీ ఎల్బీనగర్ ఇంచార్జ్ మరియు మేడ్చల్ జిల్లా ప్రభారి సామ రంగారెడ్డి, బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి మరియు గడ్డి అన్నారం డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి , కొత్తపేట్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ నాయికోటి పవన్ పరామర్శించి,చిన్నారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం అద్విక్ ఎల్బీనగర్లోని కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని చికిత్సకు సంబంధించిన ఆసుపత్రి బిల్లు మొత్తం ..11,85,503.79 కు చేరుకుంది. ఘటన జరిగిన సమయంలో లచ్చి రెడ్డి బిజెపి పార్టీ ఎల్బీనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ సామ రంగారెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఎంఎంసికార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ మరియు సంబంధిత ప్రభుత్వ అధికారులతో మాట్లాడి చిన్నారి అద్విక్ చికిత్సకు అయ్యే మొత్తం ఖర్చును ప్రభుత్వమే భరించాలని కోరారు.స్పందించిన ప్రభుత్వ అధికారులు చిన్నారి అద్విక్ అయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వం భరిస్తుందని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. అయితే ప్రస్తుతం ఆసుపత్రి యాజమాన్యం బిల్లు చెల్లించాలని కుటుంబ సభ్యులపై ఒత్తిడి తీసుకురావడం, ఈ విషయంలో అధికారులు స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లేష్, శ్రీధర్ రెడ్డి, మహేష్, సతీష్, రఘునందన్ జోషి మరియు అద్విక్ తండ్రి సుమన్, కేతాన్ ,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## స్మశాన వాటికలను అభివృద్ధి పరచండి : రాంప్రదీప్



మల్కాజ్గిరివి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కృష్ణారెడ్డిని కలిసిన రాంప్రది మునిగంటి

**కుషాయిగూడ, జూన్ 12, ప్రభాతవార్త**

అధ్వానంగా మారిన స్మశాన వాటికలను సుందరీకరించి అభివృద్ధి పరచాలని అమీర్పేట్ హెచ్బి కాలనీ డివిజన్ అధ్యక్షులు మునుగంటి రాంప్రదీప్ పేర్కొన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కాప్రా సర్కిల్ పరిధిలోని ఎస్పీ కాలనీ అమీర్పేట్ డివిజన్ పరిధిలో గల స్మశాన వాటికలను అభివృద్ధి పరచాలంటూ మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెలవిరాజేందర్ ఇచ్చిన సిఫార్సు లేఖను మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి అందజేశారు. స్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలియపరిచారు. స్మశాన వాటికలు అభివృద్ధికి తగిన ప్రణాళిక రూపొందిస్తామని వినయ్ కృష్ణారెడ్డి హామీ ఇచ్చారు.

## భక్తిశ్రద్ధలతో ఏకాదశ కుండాత్మక మహాయాగం



భక్తులతో హోమం చేయిస్తున్న గురుమాతాశ్రీ దివ్యరమణ చక్రవర్తుల

**ఎల్.బి.నగర్, జూన్ 12 ప్రభాతవార్త:**

చైతన్యపురి డివిజన్ ఫణిగిరికాలనీలో అధిక మాసం సందర్భంగా శ్రీమన్నారాయణ మహాలక్ష్మి ఏకాదశ కుండాత్మక మహాయాగం శ్రీలక్ష్మీనారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో గురుమాతాశ్రీ దివ్యరమణ చక్రవర్తుల వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి గురుమాతాశ్రీ అనుగ్రహ భాషణ చేశారు.అధిక మాసాన్ని పురుషోత్తమ మాసమని కూడా అంటారని, ఈ మాసానికి అధిపతి శ్రీమహావిష్ణువు. వారి ప్రీతికై చేసే యాగాలు విశేషామైన ఫలితాలు ఇస్తాయన్నారు. ఈ సందర్భంగా మహావిష్ణు విగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజ అనంతరం దివ్యచక్ర చారిటబుల్ ట్రస్ట్ నేతృత్వంలో భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రమణాచార్య, మహాద్రి టౌన్షిప్ అధినేత గోపిదేసి చంద్రశేఖర్‌రావు, చార్టెడ్ అకౌంటెంట్ కొండల్‌రెడ్డి, గంజి భాస్కర్, శశికాంత్‌రెడ్డి, మేరెడ్డి హిమారెడ్డి, పావని, శివానంద అగర్వాల్, పలువురు భక్తులు అధిక సంఖ్యలో హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## హత్యాయత్నం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి : కటకం నర్సింగరావు



బాధితురాలు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కటకం నర్సింగరావు

**ఎల్.బి.నగర్, జూన్ 12 ప్రభాతవార్త:**

బాలికపై హత్యాయత్నం చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగరావు డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా కేంద్రం 2 టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని అపార్ట్మెంట్ నాలుగో అంతస్తులో జరిగిన 12 సంవత్సరాల బాలికపై జరిగిన హత్యాయత్నం ఘటనపై మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కటకం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రస్తుతం నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను శుక్రవారం ఆయన సందర్శించి బాలిక ఆరోగ్య పరిస్థితిని గురించి తెలుసుకొని బాలిక తల్లిదండ్రులు రమేష్, పార్వతులను పరామర్శించారు. బాలికపై జరిగిన సంఘటన గురించి పూర్తి వివరాలు తెలుసుకొని వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలిక చికిత్స భాద్యత మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, వారికి జరిగిన అన్యాయానికి తగిన న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు.ఇలాంటి దుర్మార్గమైన ఘటనలు పునరావతం కాకుండా నిందితునిపై కఠిన శిక్షలు విధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాస్ రాష్ట్ర ప్రచారకార్యదర్శి పెద్దవూర బ్రహ్మయ్య, ప్రసాద్, రజక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ముదిగొండ అజయ్, మాస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ దూదిగామ వీరన్న,బంగారుగడ్డ దశరథ, రమేష్,మాస్ రాష్ట్ర ప్రచారకార్యదర్శి దువ్వాల శ్రీకాంత్, సోషల్ మీడియా ఇంచార్జ్ కైరంకొండ నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులు రాజకీయంగా ముందుకు రావాలి : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

**సైదాబాద్, జూన్ 12 ప్రభాతవార్త:** ఆర్యవైశ్యులు రాజకీయంగా ముందుకు రావాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సర్పంచ్ ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా గెలుపొందిన ఆర్యవైశ్యులకు సన్మానం, ఆర్య వైశ్య మహాసభ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని శుక్రవారం చంపాపేటలోని సామ సరస్వతి గార్డెన్స్‌లో తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ మంత్రి టి.జి.వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో అతి ఎక్కువ సభ్యత్వాలు కలిగిన ఏకైక మహాసభ ఆర్యవైశ్య మహాసభ అని అన్నారు. లక్ష అరవై వేల శాశ్వత సభ్యులు ఉన్నారని, ఈ రెండు సంవత్సరాలలో రెండు లక్షల సభ్యత్వాలు చేసే బాధ్యతను 34 జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యులు తీసుకోవాలని కోరారు. ఉప్పల్ భగాయత్, చింతల్‌బస్తీ, తిరుపతిలో సత్రాల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత కొణిజేటి రోశయ్య జ్ఞాపకార్థం కోటి రూపాయల నిధిని ఏర్పాటు చేసి నిరుపేద విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శిగా కొండ్లె మల్లికార్జున్, కోశాధికారిగా రేణుకుంట్ల గణేష్ గుప్తా, కార్య నిర్వాహక కార్యదర్శిగా ఇరుకుల్ల రామకృష్ణ, అదనపు ప్రధాన కార్యదర్శిగా ముక్త శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటీవ్ ఉపాధ్యక్షుడిగా వంగేటి అశోక్ కుమార్, చీఫ్ కో ఆర్డినేటర్‌గా చింతల రవి కుమార్ గుప్తా, రాజకీయ కమిటీ ఛైర్మన్‌గా ఆగీర్ వెంకటేష్, ఉప్పల్ భగాయత్ భవన నిర్మాణ కమిటీ ఛైర్మన్‌గా పలబట్ల ఆనంద్‌బాబు, తిరుపతి భవన నిర్మాణ కమిటీ ఛైర్మన్‌గా దోసపాటి వెంకటేశ్వరరావు, చింతలబస్తీ భవన నిర్మాణ కమిటీ ఛైర్మన్‌గా చంద్రకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కాచం సత్యనారాయణ గుప్తా, మహిళా కమిటీ ఛైర్మన్‌గా భవాని, ప్రధాన కార్యదర్శిగా సామ్రాజ్యలక్ష్మిలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గండె సురేష్ గుప్తా, ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్, కోశాధికారి బద్రినాథ్, వాసవి సేవాదళ్ అధ్యక్షుడు బచ్చు మహేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి : కిషన్



**తుర్కయంజాల్ జూన్12,ప్రభాతవార్త**

జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని తుర్కయంజాల్, తొర్రూర్ డివిజన్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికుల 5 నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, డిప్యూటీ కమిషనర్ బి.సత్యనారాయణ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి కిషన్ మాట్లాడుతూ ఆదిభట్ల సర్కిల్లో సుమారు 71 మంది మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు గతంలో మున్సిపాలిటీలుగా ఉన్నప్పటి నుండి గత మూడు సంవత్సరాలుగా పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారని ఈ కార్మికులకు ఏ రోజు కూడా ప్రతి నెల వేతనాలు ఇవ్వకుండా మూడు నాలుగు నెలలకు ఒకసారి ఇస్తూ వీరితో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని అన్నారు. ఈ కాంట్రాక్ట్ కార్మికులు ఎవరికీ కూడా ఈఎస్ఐ పిఎఫ్ మరియు ఇతర చట్టబద్ధమైన సౌకర్యాలు ఏవీ కూడా వర్తించడం లేదన్నారు 2025వ సంవత్సరంలో అక్టోబర్ నవంబర్ డిసెంబర్ మూడు నెలలు పెండింగ్ వేతనాలు ఇవ్వడమే కాకుండా 2026 ఏప్రిల్ మే రెండు నెలల వేతనాలు కూడా కార్మికులకు అందక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. వెంటనే కార్మికులకు రావలసిన ఐదు నెలల పెండింగ్ వేతనాలతో పాటు ఇతర చట్టబద్ధమైన సౌకర్యాలు అన్నీ కూడా కల్పించాలని ఈ కార్మికులందరినీ వెంటనే పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు నార్లకంటి సాలయ్య, మోలుగు కృష్ణ, రాసమల్ల రవి,కందాల రవి, చెక్క స్వప్న, మల్లెల జయ, దీవెన, జ్యోతి, ప్రశాంత్ జంగయ్య అంజి, పెంటయ్య, ప్రదీప్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు

## జిల్లెలగూడ చందన చెరువు కట్టకు ఆనుకొని మడిగెల ఏర్పాటుపై అభ్యంతరం

**-జోనల్, డిప్యూటీ కమిషనర్‌లకు మాజీ కార్పొరేటర్ ఫిర్యాదు**



జిల్లెలగూడ చందన చెరువు కట్ట రోడ్డు వైపు అక్రమంగా కమర్షియల్ మడిగల నిర్మాణం జరుగుతున్న భవనం

**సరూర్‌నగర్, జూన్ 12 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం జిహెచ్ఎంసి శంషాబాద్ జోన్ పరిధి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని 59, 60 డివిజన్ల కిందకు వచ్చే జిల్లెలగూడ గ్రామానికి సంబంధించిన చందన చెరువు కట్టకు ఆనుకొని నిర్మిస్తున్న భవనానికి అక్రమంగా కట్ట రోడ్డు వైపు మడిగల ఏర్పాటు ప్రయత్నాలపై స్థానిక మాజీ కార్పొరేటర్ పోరెడ్డి పద్మ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ప్రజాప్రయోజనాల దృష్ట్యా సదరు అక్రమ నిర్మాణంపై శంషాబాద్ జోనల్ కమీషనర్‌కు అదే విధంగా బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్‌కు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న సదరు నిర్మాణాలకు అడ్డుకట్ట వేసి నిలుపుదల చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పద్మ భాస్కర్‌రెడ్డి జడ్‌సి, డిసిలను కోరారు. జిల్లెలగూడ గ్రామ పరిధిలోని చందన చెరువు కట్టకు దిగువన గతంలో చేసిన వెంచర్‌లో కట్టకు దగ్గరగా ఉన్న ప్లాట్ల ఓనర్లలో కొందరు కట్టకు ఆనుకొని భవన నిర్మాణాలు చేస్తూ కమర్షియల్ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని మాజీ కార్పొరేటర్ ఆరోపించారు. స్థానిక చందన చెరువు కట్ట వెడల్పు, అభివృద్ధి, సుందరీకరణ జరిగిన నేపథ్యంలో కట్ట వైపు కన్నేసిన కొందరు ప్లాట్ల యజమానులు కట్ట రోడ్డు వైపు మడిగల ఏర్పాటు చేస్తున్నారని ఆమె వివరించారు. గతంలో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఉన్న సమయంలో కట్ట వైపు ఓ భవన యజమాని మడిగెలు ఏర్పాటు చేస్తే స్పందించిన ఆనాటి కమీషనర్ చర్యలు తీసుకొని రోడ్డు వైపు జాలి (మెష్) ఏర్పాటు చేశారని పద్మ గుర్తు చేశారు. సుందరీకరణ జరిగిన చందన చెరువు కట్ట వైపు మడిగలు నిర్మించుకుంటూ పోతే తీవ్ర ఇబ్బందులు అవుతాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. షాపులు వల్ల వాటి ముందు కట్టపై వాహనాల అక్రమ పార్కింగ్‌తో ట్రాఫిక్ ఇబ్బందులు కలిగి ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కట్ట వైపు నిర్మిస్తున్న మడిగెల నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. భవిష్యత్తులో ఎవరూ కూడా అక్రమంగా మడిగెలు వేయకుండా కట్ట పొడవుగా రోడ్డు ఫెన్సింగ్ (జాలి/మెష్) ఏర్పాటు చేయించాలని పద్మ భాస్కర్‌రెడ్డి జోనల్ కమీషనర్, డిప్యూటీ కమీషనర్లకు విజ్ఞప్తి చేశారు.

## శ్రామిక నగర్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి కృషి

**-సమస్యల పరిష్కారానికి త్వరలో చర్యలు**

**: డివిజన్ అధ్యక్షుడు మొహమ్మద్ గౌసుద్దీన్**



**నేరెడ్ మెట్ , జూన్ 12 ప్రభాతవార్త :** మౌలాలి డివిజన్ పరిధిలోని శ్రామిక నగర్ కాలనీలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని శ్రామిక నగర్ డివిజన్ అధ్యక్షుడు మొహమ్మద్ గౌసుద్దీన్ తెలిపారు. కాలనీలో నెలకొన్న పలు ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు.శ్రామిక నగర్ లోని జాన్ రోజర్ స్కూల్ సమీపంలో భూగర్భ డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాల సమీపంలోని ఖాళీ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, అలాగే పాఠశాల ముందు రహదారిపై ఉన్న విద్యుత్ స్తంభాన్ని ప్రజలకు, విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా పక్కకు తరలించడం వంటి కీలక సమస్యలను స్థానికులు గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ సమస్యలన్నింటినీ గతంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు భాగ్యనందరావు, మహమ్మద్ సాదిక్‌లు శ్రామిక నగర్ కాలనీలో పర్యటించి స్థానిక కమిటీ సభ్యులతో కలిసి సమస్యలను పరిశీలించారు. అనంతరం వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలపై చర్చించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి దృష్టికి మరోసారి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలను గుర్తించి కాలనీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శ్రామిక నగర్ కాలనీ ప్రధాన కార్యదర్శి హమీద్, మహిళా నాయకురాలు చల్ల లీలావతి, కోశాధికారి కొంతం శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ అబ్దుల్ రెహమాన్, ఉపాధ్యక్షుడు ఇస్మాయిల్, సభ్యులు ఆశీర్వాదం, మొహమ్మద్ కరీం తదితరులు పాల్గొన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, కాలనీ కమిటీ సభ్యులు సమన్వయంతో ముందుకు రావడం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలి




బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాధికారి రామరావు, ఏఐవైఎఫ్ నాయకులు ధర్మేంద్ర, సత్యప్రసాద్ తదితరులు

**ఉప్పల్, జూన్ 12 ప్రభాతవార్త :** ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏఐవైఎఫ్, బాలసంఘం ఉప్పల్ నియోజకవర్గ సమితి సంయుక్తా ఆధ్వర్యంలో ఉప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఉప్పల్ మండల విద్యాశాఖ అధికారి ఆర్. రామారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ దేశాభివృద్ధికి, సమాజ పురోగతికి పెద్ద అడ్డంకిగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రతి చిన్నారికి విద్య అనేది రాజ్యాంగబద్ధమైన హక్కు అని, పాఠశాలలో ఉండాల్సిన పిల్లలు పనుల్లో నిమగ్నమవడం బాధాకరమని అన్నారు. పిల్లలను పనుల్లో పెట్టడం చట్టరీత్యా నేరమే కాకుండా వారి భవిష్యత్తును దెబ్బతీసే చర్య అని తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం, విద్యాశాఖ, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి బాలబాలికను తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలని పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్. మాట్లాడుతూ, పేదరికం, నిరుద్యోగం, సామాజిక అసమానతల కారణంగా బాల కార్మిక వ్యవస్థ కొనసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, బాలసంఘం నేతలు చంద్రశేఖర్, వికాస్, అజీమ్ పాషా, మహేష్ , సమీర్, అలీ, షోయిబ్, సల్మాన్, బన్నీ పాల్గొన్నారు.

## 24న చిలుకేశ్వర ఆలయంలో కోటి లింగాల స్థాపన



చిలుకేశ్వర ఆంజనేయస్వామి ఆలయంలో కోటి లింగాల స్థాపన ఆహ్వాన పత్రిక అందజేస్తున్న అధ్యక్షుడు దాసరి కృష్ణ తదితరులు

**ఉప్పల్, జూన్ 12 ప్రభాతవార్త :** చిలుకానగర్‌లోని హరిహర క్షేత్రం శ్రీ చిలుకేశ్వర ఆంజనేయ స్వామి దేవాలయంలో ఈనెల 24వ తేదీ నుంచి కోటిలింగాల స్థాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి అధ్యక్షులు దాసరి కృష్ణ, ప్రధాన కార్యదర్శి గోనె శ్రీకాంత్, కోశాధికారి అమృత రావు, ఆలయ కమిటి సభ్యులు గోనె అంజయ్య, దేవసాని బాలచందర్, రామచర్ల బలరాం, కావాలి నరసింహ, గూడ శ్రీశైలం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆలయంలో జరిగే కోటి లింగాల స్థాపన ఆహ్వాన పత్రికను ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, ఎసిపి వెంకట్‌రెడ్డి, సిఐ రామలింగారెడ్డి, తహసీల్దార్ పూల్ సింగ్ చౌహాన్ తదితరులకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ చిలుకానగర్ శివాలయం పునర్నిర్మాణంలో భాగంగా ఈనెల 24వ తేదీ నుంచి శ్రీ చిలుకేశ్వర ఆంజనేయ స్వామి సన్నిధిలో జగద్గురువులు విజయేంద్ర సరస్వతి స్వామి, శ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు దివ్య ఆశీస్సులతో కోటిలింగాల స్థాపన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అంగరంగ వైభవంగా జరిగే ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరవుతున్నారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## శ్రీనగర్ కాలనీలో కొత్త ట్రంక్ లైన్ నిర్మాణానికి చర్యలు



శ్రీనగర్ కాలనీలో ట్రంక్ లైన్ సర్వే పరిశీలిస్తున్న బిఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్, ఇతర అధికారుల

**ఉప్పల్, జూన్ 12 ప్రభాతవార్త :** బీరప్పగడ్డ డివిజన్ శ్రీనగర్ కాలనీ, ధర్మపురి కాలనీలో రూ.కోటి 45లక్షల వ్యయంతో నిర్మిస్తున్న స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణంపై శుక్రవారం మున్సిపల్ అధికారులు పరిశీలన చేశారు. మున్సిపల్ ఎస్ఇ హరి కిషోర్,డిఇ వెన్నెల గౌడ్, ఎఇ రాజ్ కుమార్ తదితరులతో కలిసి బిఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ పలు ప్రాంతాల్లో పర్యటించారు. నూతన ట్రంక్ లైన్ నిర్మాణంతో ప్రజలకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ట్రంక్ లైన్ నిర్మాణంలో కాలనీ వాసుల భాగస్వామ్యంతో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రంక్ లైన్ ఏర్పాటు చేస్తామని ఎస్ఇ హరి కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు కొక్కొండ జగన్, శ్యామ్, బంటి గౌడ్, శ్రీనివాస్, శ్రీనగర్ కాలనీ అధ్యక్షులు ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నుల పంపిణీ




ఉచితంగా నోటు పుస్తకాలు, పెన్నులు అందుకున్న విద్యార్థులు

**సరూర్‌నగర్, జూన్ 12 ప్రభాతవార్త:** పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్న నేపథ్యంలో బడంగ్‌పేట్ నగర బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. స్థానిక బడంగ్‌పేట్‌లోని శ్రీ కాశీ బుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గ్లోబల్ బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గిరి ప్రసాద్ శర్మ సహకారంతో బ్రాహ్మణ సంఘం వారు పంపిణీ చేశారు.కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మంగు రాఘవరావు, చక్రవర్తుల జగన్మోహనాచార్యులు, నందూరి ప్రకాశ్, రాంబాబు, మంత్రాల శ్రీరామ్మూర్తి, నవీన్‌కుమార్, కవిత, మధుసూదన్‌రావు, రవీం దర్, గోగుల పాటి శ్రీనివాసరావులతో పాటు పలువురు హాజరై విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, పెన్నులు అందజేశారు.



ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహేతోను శుక్రవారం మాజీ కార్పొరేటర్ పవన్‌కుమార్ కలిసి డివిజన్ అభివృద్ధి, ప్రజలకు మౌలిక సదుపాయాలు, పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులపై చర్చించి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గాయత్రిపురం కాలనీ అధ్యక్షులు దుద్దిళ్ల శ్రీని వాస్, జనరల్ సెక్రెటరీ నవీన్ కుమార్, ట్రెజరర్ అనంత రాములు తదితరులు పాల్గొన్నారు.

## నీరు నిలిచే ఆర్‌సిఐ రోడ్డును పరిశీలించిన అధికారులు



ఆర్‌సిఐ రోడ్డుపై వర్షపు నీరు నిలిచే ప్రదేశాలను పరిశీలిస్తున్న ఇంజనీరింగ్, ట్రాఫిక్ విభాగాల అధికారులు

**సరూర్‌నగర్, జూన్ 12 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని 58, 60 డివిజన్ల కిందకు వచ్చే ప్రధానమైన ఆర్‌సిఐ రహదారిలో వర్షపు నీరు నిలవకుండా స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చర్యలు తీసుకుంటున్నారని సీనియర్ బిఆర్ఎస్ నాయకుడు, జిల్లెలగూడ వెంకటేశ్వర స్వామి దేవాలయ మాజీ ధర్మకర్త మాదరి రమేష్ తెలిపారు. జిల్లెలగూడ వైఎస్ఆర్ కన్వెన్షన్ సమీపంలోని ఆర్‌సిఐ రోడ్డులో చందన చెరువు పక్కన రోడ్లకు ఇరువైపులా అదే విధంగా బాలాపూర్ చౌరస్తా సమీపంలోని మంత్రాల చెరువుకు పక్కన ఉన్న విశాల్ మార్ట్‌కు సమీపంలోనున్న ఆర్‌సిఐ రోడ్డులో వర్షం కురిసనప్పుడల్లా నీరు నిలిచి పోవడం పరిపాటిగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బంది అవుతుండడంపై సబితా ఇంద్రారెడ్డి స్పందించారని ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బడంగ్‌పేట్ సర్కిల్ డిఇఇ హరిణి, ఎఇఇ సౌమ్య, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ శ్రీశైలం, హైడ్రా ఎస్ఎఫ్ఓ మహ్మద్ జమీల్‌లు వర్షపు నీరు నిలిచే ఆర్‌సిఐ రోడ్డును పరిశీలించారు. ఈ మేరకు నీరు రోడ్డుపై నిలవకుండా తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చించడం జరిగిందని రమేష్ తెలిపారు. సబితారెడ్డి చొరవ కారణంగా ఆర్‌సిఐ రోడ్డుపై నీరు నిలవకుండా సాఫీగా వెళ్ళేందుకు అధికారులు చర్యలు తీసుకుంటారని ఆయన పేర్కొన్నారు.

## బీరప్పగడ్డ సమస్యలపై జోనల్ కమిషనర్‌కు వినతి



ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాకు వినతి పత్రం అందజేస్తున్న ఇర్షద్‌ఖాన్ తదితరులు

**ఉప్పల్, జూన్ 12 ప్రభాతవార్త :** బీరప్పగడ్డ డివిజన్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ నేత ఇర్షద్ ఖాన్ ఆధ్వర్యంలో శుక్రవారం జోనల్ కమిషనర్ రాధికగుప్తాను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఇర్షద్‌ఖాన్ మాట్లాడుతూ ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ ట్రాఫిక్ మళ్లింపు కారణంగా బీరప్పగడ్డ రహదారిపై వాహనాల రద్దీ పెరిగి ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. వర్షాకాలం కారణంగా ఏర్పడిన గుంతలు, దెబ్బతిన్న మ్యాన్ హోల్స్, అధిక వేగంతో వెళ్తున్న వాహనాల వల్ల స్థానిక ప్రజలు మరియు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రమాదాలు జరిగే అస్కారం ఉందని, తగు చర్యలు తీసుకో వాలని కోరారు. దీనిపై జోనల్ కమిషనర్ వెంటనే స్పందించి ఇంజనీరింగ్ విభాగం అధికారులకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీశ్రీనివాస కళ్యాణ మహోత్సవం



కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఉప్పల స్వప్నశ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, జూన్ 12 ప్రభాతవార్త:** ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగ్ అధ్యక్షురాలు మంజుల ఆధ్వర్యంలో కొత్తపేటలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శ్రీశ్రీనివాస కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ మహోత్సవానికి ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్‌గుప్త దంపతులు ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణ శ్రీవెంకటేశ్వరస్వామివారి కళ్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. కార్యక్రమంలో సామూహిక లలితాదేవి పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం, మణిద్వీప వర్ణన, వాసవీమాత గోష్టి సేవ పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్‌గుప్త మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణలో మహిళల పాత్ర అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. సమాజంలో ఆధ్యాత్మికత, నైతిక విలువలు, సేవాభావాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. వైశ్య సమాజ ఐక్యతకు, యువతలో ధార్మిక చైతన్యం పెంపొందించేందుకు ఐవిఎఫ్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృత స్థాయిలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కక్కిరాల రమేష్, సుజన, ఐవిఎఫ్ అడ్వైజర్ బోర్డ్ చైర్మెన్ గంజి రాజమౌళిగుప్త, ముస్తాల సత్తయ్య, పబ్బ చంద్రశేఖర్, కట్ట రవికుమార్‌గుప్త, నారాయణ కటకం శ్రీనివాస్, నరేశ్, ప్రవీణ్, నవీన్, బెల్లె రవికుమార్, సంబు పాడు సప్త, బోనగిరి శ్రీనివాస్, చింతల రజవకాంత్, మణిమాల. నలిని, అర్చన, రాధిక తదితరులు పాల్గొన్నారు.

## అల్మాస్‌గూడ శ్రీ వెంకటేశ్వర కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి మోక్షం

**-నిధుల మంజూరుకు కృషి చేసిన మల్లారెడ్డికి కాలనీవాసుల కృతజ్ఞతలు**



రోడ్ల నిర్మాణానికి కృషి చేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డిని సన్మానిస్తున్న అల్మాస్‌గూడ వెంకటేశ్వర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

**సరూర్‌నగర్, జూన్ 12 ప్రభాతవార్త:**

జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని నూతన డివిజన్ నాదర్‌గుల్ కిందకు వచ్చే అల్మాస్‌గూడ శ్రీ వెంకటేశ్వర కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషి చేసి సహకరించిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డికి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపి సన్మానించింది. పాత బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఓల్డ్ వార్డు 4కు సంబంధించిన ఈ కాలనీలో అంతర్గత రహదారులు అధ్వాన్నంగా ఉన్న కారణంగా స్థానికులకు ఇబ్బందులు కలుగుతుండంతో సంక్షేమ సంఘం నాయకులు మల్లారెడ్డికి దృష్టికి తేవడంతో జరిగింది. ఈ నేపథ్యంలో స్పందించిన మల్లారెడ్డి సంఘం నాయకులు, కాలనీవాసులతో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కెఎల్‌ఆర్‌ను కలిసి సమస్యను వివరించి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అప్పట్లో ఇంఛార్జి మంత్రి శ్రీధర్‌బాబు ద్వారా నిధులు మంజూరు చేయిస్తానని కెఎల్‌ఆర్ హామీనివ్వడం జరిగింది. ఆ తర్వాత బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయం నుండి సంబంధిత అధికారులు కాలనీకి వచ్చి రోడ్లను పరిశీలించి ప్రతిపాదనలు పంపారు. దీంతో అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ.38 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించి గత ఏప్రిల్ నెలలో టెండర్ ప్రక్రియ కూడా పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో రోడ్ల నిర్మాణపు పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో కాలనీ సంఘం ఆహ్వానం మేరకు కాంగ్రెస్ నేత మల్లారెడ్డి శుక్రవారం స్థానికంగా పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు రోడ్ల నిర్మాణానికి కృషి చేసినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడానికి ప్రజా ప్రభుత్వంలో కాంగ్రెస్ నాయకునిగా తన వంతు కృషి చేస్తున్నానని స్పష్టం చేశారు. తన విజ్ఞప్తి మేరకు వెంకటేశ్వర కాలనీలో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సహకరించిన ఇంఛార్జి మంత్రి శ్రీధర్‌బాబు, నియోజకవర్గ ఇంఛార్జి కెఎల్‌ఆర్, శంషాబాద్ జోనల్ కమీషనర్ చంద్రకళ, బడంగ్‌పేట్ సర్కిల్ అధికారులకు మల్లారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.